ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం
వార్త
శుక్రవారం 17, మే 2024 | 8 పేజీలు



# పట్టభద్రుల ఉప ఎన్నిక ఏర్పాట్లు వేగవంతం చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి.గౌతమ్




8వ పేజీలో...


# దద్దరిల్లుతోన్న దండకారణ్యం!

## కీకారాణ్యంలో బాంబుల మోత





**భద్రాచలం, ప్రభాతవార్త :** మావోయిస్టుల అడ్డా ఛత్తీస్‌ఘడ్ దండకారణ్యం. ఒకప్పుడు వారికి ఇక్కడి కీకారారణ్యం సేఫ్ జోన్. నేడు అది వారికి డేంజర్ జోన్‌గా మారింది. ఆకురాలే కాలం మావోయిస్టులను నేలకొరిగేలా చేసింది. ఆపరేషన్ కగార్‌తో భద్రత బలగాలు అడవులను చుట్టుముడుతున్నాయి. బాంబుల మోతతో దండకారణ్యం దద్దరిల్లుతోంది. గడిచిన మూడు మాసాల్లో 27 ఎన్‌కౌంటర్‌లు జరగడం గమనార్హం. పచ్చని అడవుల్లో రక్తపు టేరులు పారుతున్నాయి. జరుగుతున్న పరిణామాలతో సమీప అటవీ ప్రాంత ప్రజలు ఉక్కిరిబిక్కిరికి లోనవుతున్నారు. ఏజెన్సీలో క్షణం క్షణం భయం భయం నెలకొంది.





ఛత్తీస్‌ఘడ్ అటవీ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. మావోయిస్టుల ఏరివేతనే లక్ష్యంగా భద్రత బలగాలు అడవులను జల్లెడ పడుతున్నాయి. ఈ క్రమంలో తరుచూ ఎన్‌కౌంటర్‌లు చోటుచేసుకుంటున్నాయి. గడిచిన మూడు మాసాల్లో 27 ఎన్‌కౌంటర్‌లు జరగడం ఇక్కడి తీవ్రతను చాటుతోంది. 103 మంది ఈ ఎదురుకాల్పుల్లో మృత్యువాత పడ్డారని మావోయిస్టులు ప్రకటించడం జరిగింది. ఈ మేరకు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్, భద్రాద్రికొత్తగూడెం అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి పేరున ఆజాద్ పత్రికా లేఖలు విడుదల చేయడం జరిగింది. ఛత్తీస్‌ఘడ్ దండకారణ్యంలో అలజడి ఏర్పడింది. నిత్యం ఏదో ఒక మూల రక్తపాతం చోటుచేసుకుంటోంది. పెద్ద ఎత్తున సాయుధ బలగాలు దండకారణ్యాన్ని చుట్టుముట్టాయి. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను తుదముట్టించేందుకు భద్రతా బలగాలు ముందుకు కదులుతున్నట్లు జరుగుతున్న పరిణామాలను బట్టి తేటతెల్లం

- కొనసాగుతున్న ఆపరేషన్ కగార్
- నేలకొరుగుతున్న మావోయిస్టులు
- ఏజెన్సీలో క్షణం క్షణం భయం భయం
- చుట్టుముట్టిన పోలీసు బలగాలు

వివరాలు 2 లో..

# పోడు విధ్వంసంపై ట్రిబ్యునల్ సీరియస్

- పత్రికా కథనాలే సుమోటోగా కేసు నమోదు
- తెలంగాణ సర్కార్‌కి ఎన్‌జిటి నోటీస్‌లు
- వన్యప్రాణి మనుగడకోసం ఆందోళన
- వలస పోడు ప్రమాదాన్ని ఆరాతీసిన బెంచ్



8 లో..

**అశ్వారావుపేట-ప్రభాతవార్త**

తెలంగాణాలోని వలస పోడు విధానాలు., దరిమిలా ఏర్పడుతున్న జీవవైవిధ్య విధ్వంసాల పై నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్‌లో కేసు నమోదయింది. ఒక ప్రముఖ జాతీయ దినపత్రికలో 15.03.2024 న ప్రచురితమైన కథనానికి స్పందించి "సుమోటోగా" ఎన్‌జిటి విచారణకు స్వీకరించి, తెలంగాణా సర్కార్‌కి నోటీస్‌లు జారీచేయడం నిజంగా ఆసక్తికర అంశమే. "అడవి కుదించుకుపోతున్నదని అందువల్ల బిగ్‌క్యాట్ జాతి అంతరించి పోతున్నదని" ఆ పత్రిక హెడ్డింగ్ పెట్టి అనేక పర్యావరణ అంశాలను ప్రస్తావించింది. "బిగ్‌క్యాట్" అంటే పిల్లి జాతికి చెందిన మొత్తం 8విభిన్న క్యాటగిరిలో సింహం, పెద్దపులి, చిరుతలు, కూడా వస్తాయి. అంతే కాకుండా తెలంగాణా భౌగోళిక స్వరూప రీత్యా మొత్తం భూవిస్తీర్ణంలో 24.07శాతం అటవీ ప్రాంతముండగా, వలస పోడు విధానం మితిమీరుతున్న కారణంగా అనేక అనర్థాలు పొంచి ఉన్నాయని అందులో ఆందోళన వ్యక్తం చేశారు.

# ఆదివాసీల కుల నిర్మూలనే బీజేపీ విధానం

**చర్ల, ప్రభాతవార్త :** ఆదివాసీలను కుల నిర్మూలన చేయడమే బీజేపీ ప్రభుత్వ విధానమని, నరేంద్రమోడీ సమీక్ష ఛత్తీస్‌ఘడ్ ఉపముఖ్యమంత్రి విజయశర్మ, ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయి సారధ్యంలో కగార్ అనే భయంకరమైన అణచివేత ప్రచారంతో జరుగుతున్న ద్రోహపూరిత దాడులను ధైర్యంగా ఎదుర్కొని తమ ప్రాణాలను అర్పించారని దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ మావోయిస్టు పార్టీ పేరుతో విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు. అదేవిధంగా ఆ లేఖలో ఈ విధంగా పేర్కొని ఉంది ...



2 లో..

- మారణ హోమాన్ని ఆపాలన్న నినాదంతో ముందుకు సాగాలి
- ఫాసిస్టు బ్రింక్ అణచివేత ప్రచారాన్ని ప్రతిఘటించండి
- 27 ఎన్‌కౌంటర్‌లలో 40 మంది అమాయక గిరిజనులు బలి
- ఇప్పటి వరకు 18 ఫేక్ ఎన్‌కౌంటర్లు జరిగాయి
- చర్చల పేరుతో కాలం వెళ్ళదీస్తున్నారు
- మా డిమాండ్‌లకు ప్రభుత్వం నుంచి నేటికీ స్పందన కరువు
- చర్చలకు మానవహక్కుల సంఘం, జర్నలిస్టులు కృషి చేయాలి
- దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ పేరుతో లేఖ



2వ పేజీలో...

# ఏసీబీ దాడుల్లో పట్టుబడిన ట్రాన్స్‌కో ఏఈ

- కరెంట్ లైన్ మంజూరికి రూ.లక్ష డిమాండ్
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

# దద్దరిల్లుతోన్న దండకారణ్యం ...!

(మొదటి పేజీ తరువాయి..)

అవుతుంది. డ్రోన్‌లు, హెలికాప్టర్‌లను సైతం భద్రతా బలగాలు వినియోగిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. వీటి ద్వారా మావోయిస్టుల కదలికలను గమనించి డ్రోన్‌ల ద్వారా బాంబుల దాడులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయాన్ని మావోయిస్టులు విడుదల చేసిన లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. ప్రస్తుతం వేసవికాలం కావడం, ఆకురాలడంతో ఈ పరిస్థితి పోలీసు బలగాలకు అనుకూలంగా మారినట్లు సమాచారం. దీంతో పోలీసు బలగాలు పెద్ద ఎత్తున దండకారణ్యంలో ముందుకు సాగుతున్నట్లు వినికిడి. వివిధ సాయుధ బలగాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొంటున్నట్లు తెలుస్తుంది. జరిగిన ఎన్‌కౌంటర్‌లో సాధారణ పౌరులు కూడా మృత్యువాత పడుతున్నారని మావోయిస్టులు లేఖల్లో వెల్లడించారు. 60 మందికి పైగా ఆదివాసీ మహిళలు, పిల్లలు, వృద్ధులు ఈ ఎదురుకాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారని వారు ఆరోపించారు. ఈ క్రమంలో అడవుల్లో ఏ క్షణంలో ఏమి జరుగుతుందో తెలియని భయానక వాతావరణం నెలకొంది. సమీప గ్రామ ప్రజలు ఉక్కిరిబిక్కిరికి లోనవుతున్నారు. మావోయిస్టు పార్టీ నిర్మూలన పేరుతో బస్తర్‌లో ఆదివాసీలపై దాడులుజరుగుతున్నాయని, బీజేపీ ప్రభుత్వం గత 9 ఏండ్లుగా అనేక చట్టాలను తీసుకుని వచ్చి విప్లవ పోరాటాలను అణచివేస్తుందని, డ్రోన్‌ల ద్వారా బాంబు దాడులను చేస్తూ భయాందోళనలను రేకెత్తించడం జరుగుతుందని భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు భద్రాద్రికొత్తగూడెం -అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరున ఈ మేరకు పాత్రికేయులకు లేఖను విడుదల చేయడం జరిగింది.

**-ఏజెన్సీలో క్షణం క్షణం భయం భయం**

ఛత్తీస్‌ఘడ్ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని తెలంగాణ, ఏపీ సరిహద్దు పల్లెలు ఉన్నాయి. ఛత్తీస్‌ఘడ్‌లో భీకర యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో సరిహద్దు గ్రామ ప్రజలు ఉక్కిరిబిక్కిరికి లోనవుతున్నారు. ప్రధానంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా ఉన్న భద్రాచలం నియోజకవర్గంలోని అటవీ ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. ఏ సమయంలో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠతో స్థానికులు కలత చెందుతున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో సైతం తెలంగాణ, ఆంధ్ర పోలీసులు డేగ కన్ను వేశారు. ఇప్పటికే ఏజెన్సీ చుట్టూ సీఆర్పీఎఫ్ బెటాలియన్‌లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. నిత్యం విస్తృత తనిఖీలు గావిస్తున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలను చేపడుతున్నారు.

## ఆదివాసీల కుల నిర్మూలనే బీజేపీ విధానం

(మొదటి పేజీ తరువాయి..)

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ వీడదీసిన పార్టీ పీఎల్‌జీఏ కామ్రేడ్‌లను పోలీసు గుండాలచే హత్య చేయబడిన గ్రామస్తులకు వినయపూర్వకమైన నివాళులు అర్పిస్తున్నాం. వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం. జనవరి నుంచి ఇప్పటి వరకు దండకారణ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్, క్రాస్‌ఫైర్‌లో 107 మంది చనిపోయారని ఒడిస్సా ఎంఎంసీ కమిటీ పరిధిలో 9 మంది అమరులయ్యారు. ఇప్పటి వరకు 27 సంఘటనలు జరగగా అందులో తప్పుడు ఎన్‌కౌంటర్‌లు 18 జరిగాయని అన్నారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌లలో 40 మంది వరకు ఆదివాసీలు చంపబడ్డారని తెలిపారు. కొచ్చేలి, చీపురుబట్టి, కాకూర్, తాకమెట్ట, పిడియా ఘటనల్లో మృతదేహాల సంఖ్య పెంచి పోలీసులు పెద్ద సక్సెస్‌గా చూపించేందుకు అమాయక ఆదివాసీలను పట్టుకుని చంపారని ఆరోపించారు. కొచ్చేలిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 13 మంది అమరులవ్వగా ... అందులో నలుగురు మాత్రమే పీఎల్‌జీఏ సభ్యులని, మిగిలిన 9 మంది గ్రామస్తులుగా తెలిపారు. కాకూర్‌లో విచక్షణారహితంగా కాల్పులు జరిపి నిరాయుధుడిగా ఉన్న సీనియర్ కామ్రేడ్ జోగన్నను పట్టుకుని హత్య చేశారని అన్నారు. గంగలూరు పోలీసు స్టేషన్ పరిధిలోని పిడియా సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మొదట ఆరు మృతదేహాలు లభ్యమైనట్లు చెప్పగా ఆ తరువాత సంఖ్యను 12కు పెంచారని గ్రామస్తులు ఆరుగురు వరకు ఉండి ఉంటారని అన్నారు. చవటోలా ఎన్‌కౌంటర్‌లో 29 మంది సహచరుల్లో 11 మంది నిరాయుధులు కొత్త కామ్రేడ్‌లను పట్టుకుని రెండు కిలోమీటర్ల మేర తీసుకుని వెళ్లి అక్కడ ఉన్న స్మారక చిహ్నం వద్ద కర్రలతో కొట్టి చంపారని ఆరోపించారు. తప్పుడు ఎన్‌కౌంటర్‌లో అమరులైన వ్యక్తుల మృతదేహాలను అవమానకరంగా అమానవీయంగా, మరీ క్రూరమైన రీతిలో చూపించడం ఖండించదగ్గ విషయమన్నారు. చర్చలకు సంబంధించి ప్రభుత్వం ముందు ఉంచిన మా డిమాండ్‌లపై నేటికి సమాధానం లేదన్నారు. కానీ గిరిజనుల మారణహోమం వేగవంతం అయింది. చర్చలు అంటూ ప్రకటన ఇచ్చి తప్పు దోవ పట్టించడమే ప్రభుత్వ ఉద్దేశ్యమని అన్నారు. ప్రభుత్వం చర్చల పట్ల చిత్తశుద్ధి ఉంటే సానుకూల వాతావరణం నెలకొల్పాలని అన్నారు. పోలీసు ఇన్‌ఫార్మర్‌లు తమ పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వంతో చర్చలకు మానవహక్కుల సంఘం, జర్నలిస్టులు చొరవ చూపాలని అన్నారు.

# మావోయిస్టుల పేరుతో ఆదివాసీలను మట్టు పెడుతున్నారు

**-ఆజాద్**

చర్ల, ప్రభాతవార్త: మావోయిస్టుల పేరుతో ఆదివాసీలను దొరకపట్టి చంపుతున్నారని బూటకపు ఎన్‌కౌంటర్‌లను నిజమైన ఎన్‌కౌంటర్‌లుగా చిత్రీకరిస్తున్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఆపరేషన్ కగార్ దాడి విప్లవ ప్రతిఘాతుక సూరజ్‌ఖండ్ వ్యూహాత్మక దాడిలో భాగమేనని భద్రాద్రికొత్తగూడెం -అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరిట గురువారం పత్రికలకు పంపిన లేఖలో పేర్కొన్నారు. మావోయిస్టుల నిర్మూలన పేరుతో మారణ హోమం సృష్టిస్తూ గత మూడున్నర నెలలో 103 మందిని మట్టు పెట్టారని, వారిలో 60 మంది వరకు ఆదివాసీల మహిళలు, పిల్లలు, వృద్ధులు ఉన్నారని ఆరోపించారు. మావోయిస్టుల నిర్మూలనలో భాగంగా ఈ హత్యలు జరిగాయని అన్నారు. ఛత్తీస్‌ఘడ్ అడవుల్లో నివసించేఆదివాసీ ప్రజలపై, గ్రామాలపై డ్రోన్‌ల ద్వారా బాంబు దాడులు చేస్తూ అమాయకులపై అధర్మయుద్ధం చేస్తున్నారని అన్నారు. ఈ బాంబుదాడులతో ఆదివాసీ ప్రజలు భయాందోళనతో


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని అమాయక ఆదివాసీలపై పెరుగుతున్న బాంబుదాడులను నిలిపివేయాలని అన్నారు. గెరిల్లా దళాలలో పనిచేస్తున్న కార్యకర్తల కుటుంబాలపై పోలీసులు తీవ్రమైన ఒత్తిడి పెంచుతూ వారిని లొంగదీసుకోవడానికి కోవర్టులుగా మార్చుకోవడానికి అత్యంత మోసపూరిత కుట్రలకు పాల్పడుతూ ప్రలోభాలకు గురి చేస్తున్నారని అన్నారు. తుపాకులు, డబ్బులతో పారిపై వచ్చి తమ వద్ద సరెండర్ కావాలని చెప్తున్నారు. రాష్ట్రాలలో ఆదివాసీ ముఖ్యమంత్రులు ఉన్నప్పటికి ఆదివాసీలకు న్యాయం జరగడం లేదని, ఎటువంటి పరిస్థితులలో నిస్సాయులు అయిన ఆదివాసీ ప్రజల వెంట మేమున్నామంటూ దేశం గొంతెత్తి నినాదించాల్సిన తరుణం ఆసన్నమైందని అన్నారు. కగార్‌దాడికి వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజలపై తప్పుడు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలుపుతూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు పోరాడాలని పిలుపునిచ్చారు. మావోయిస్టు పార్టీ నిర్మూలన పేరుతో బస్తర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దాడిని ఖండించండి ... దేశవ్యాప్తంగా పోరాడుతున్న ప్రజలకు అండగా నిలుస్తూ తమ సంఘీభావ ఉద్యమాలను నిర్మించాల్సిందిగా ధార్మిక కర్షక విద్యార్థి, మేధావి మహిళా సంఘాలకు పిలుపునిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవానికై పోరాడాలని ఆజాద్ పేరిట పత్రికలకు విడుదలైన లేఖలో పేర్కొని ఉంది.



## ఏసీబీ దాడుల్లో పట్టుబడిన ట్రాన్స్‌కో ఏఈ

అశ్వారావుపేట రూరల్, మే 16 ప్రభాతవార్త: అశ్వారావుపేట పట్టణ కరెంట్ ఎఇ రూ.1లక్ష లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న సంఘటన పట్టణంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అశ్వారావుపేటకు చెందిన కొనకళ్ళ ఆదిత్యకు మండల పరిధిలోని మద్దికొండ గ్రామంలో 5ఎకరాల పొలం కలదు. ఈ పొలంకు విద్యుత్ సరఫరా కోసం అశ్వారావుపేట ఎఇ శరత్‌కుమార్‌ను సంప్రదించగా అధికారికంగా ప్రభుత్వానికి చెల్లించే నగదుతో పాటు అదనంగా రూ.1లక్ష డిమాండ్ చేశారు. నేను ఇచ్చుకోలేనని ఆదిత్య చెప్పినప్పటికి ట్రాన్స్‌కో ఎఇ ఒప్పుకోలేదు. దీంతో చేసేది లేక రైతు ఆదిత్య ఎసిబిని ఆశ్రయించారు. దీంతో గురువారం సాయంత్రం స్థానిక పేపర్‌బోర్డు సమీపంలో ఎఇ శరత్‌కుమార్ రైతు వద్ద రూ.1లక్ష తీసుకుంటుండగా ఖమ్మం ఎసిబి డిఎస్పీ వై రమేష్ కుమార్ బృందం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఆయన స్థానిక ఎఇ కార్యాలయాన్ని ఎసిబి అధికారులు పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ రమేష్ మీడియాతో మాట్లాడుతూ రైతు వద్ద ట్రాన్స్‌కో ఎఇ లంచం డిమాండ్ చేయగా బాధిత రైతు ఇచ్చిన పిర్యాదు మేరకు ఎఇని నగదు తీసుకుంటున్న సమయంలో దాడి చేసి పట్టుకోవడం జరిగిందన్నారు. లంచం తీసుకోవడం, ఇవ్వడం నేరమని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఎసిబి టోల్‌ఫ్రీ నెంబర్ 1064కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ దాడుల్లో ఎసిబి ఇన్‌స్పెక్టర్‌లు సునీల్, శేఖర్, మహేష్, హెడ్ కానిస్టేబుల్ పుల్లయ్య, సబ్బంది రంగా, చారి తదితరులు ఉన్నారు.

## ఈనెల 8న జరిగే మెగా లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

కోదాడ రూరల్,ప్రభాతవార్త: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జూన్ 8న జరగబోయే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్యామసుందర్ అన్నారు. గురువారం కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కక్షీదారులకు లోక్ అదాలత్ గురించి చైతన్య పరచాలని న్యాయవాదులను కోరారు. ఈ సమావేశంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సిహెచ్.సత్యనారాయణ, పిపి బొబ్బ కోటిరెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు, బార్ అసోసియేషన్ సభ్యులు మంద వెంకటేశ్వర్లు, కోడూరు వెంకటేశ్వర్లు, హేమలత, దొడ్డ శ్రీధర్, ఎస్‌కే నాగుల్ పాషా, సీనియర్ న్యాయవాదులు వి.రంగారావు, సిలివేరు వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్ రహీం, ఉయ్యాల నరసయ్య, రంజాన్ బాషా, రియాజ్, బాలయ్య, శరత్ కుమార్, మండల లీగల్ సెల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వనాల్లో ఎండుతున్న చెట్లు

నడిగూడెం,మే16, ప్రభాతవార్త : మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో చెట్లు ఎండిపోతున్నాయి. సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో ప్రత్యేక అధికారులకు పరిపాలన బాధ్యతలను అప్పగించారు. తీవ్ర ఎండల కారణంగా చెట్ల సంరక్షణకు సరిపడా నీరు లేకపోవడంతో ఎండిపోతున్నాయి. అధికారులు కూడా ఏం చేయలేని పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లో గ్రామపంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటిని చెట్లకు పోస్తున్నప్పటికి పూర్తి స్థాయిలో న్యాయం జరగడం లేదు. గ్రామాల్లో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో పల్లె ప్రకృతి వనాల్లో చెట్ల సంరక్షణ అధికారులకు భారంగా పరిణమించింది. ఇప్పటికి గ్రామాల్లో త్రాగునీటి సమస్య కారణంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో పల్లె ప్రకృతి వనాల సంరక్షణ ఇబ్బందిగా మారింది. తిరిగి వర్షాలు కురిస్తే తప్ప పల్లె ప్రకృతి వనాల్లో చెట్ల సంరక్షణ సాధ్యపడదు. మండలంలోని 15 గ్రామాలలో ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రత్యేక శ్రద్ధ చూపి చెట్లు ఎండిపోకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

# అశ్రు నయనాలతో రాయల అంత్యక్రియలు

## - పాడే మోసిన నామా, వద్దిరాజు- నివాళులర్పించిన కూనంనేని, పువ్వాడ, సండ్ర, పువ్వాళ్ళ

<u>*తల్లాడ, మే 16, ప్రభాతవార్త*</u>

అనారోగ్యంతో మృతిచెందిన డిసిఎంఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత రాయల వెంకట శేషగిరిరావు అంత్యక్రియలు గురువారం అశ్రునయనాలతో ఘనంగా నిర్వహించారు. శేషగిరిరావును కడసారి చూసేందుకు వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో నాయకులు, అధికారులు, శత్రువులు, ఆయనతో కలిసి తిరిగిన స్నేహితులతో మిట్టపల్లి రోడ్డు కిటకిటలాడింది. ఈ సందర్భంగా శేషగిరిరావు కుమారులు రఘునందన్, రేవంత్‌లను పరామర్శించారు. శేషగిరిరావు మరణ వార్త దావనంలా వ్యాపించడంతో పాటు ఆయన సహాయం



పొందిన కొందరు పార్థీవదేహం వద్ద కంట తడి పెట్టారు. 40 ఏళ్ళ రాజకీయాల్లో ఆయన ఎదుర్కొన్న ఆటుపోట్లు, చేసిన పనులను చర్చించుకుంటున్నారు. శేషగిరిరావు ద్వారా బాగా లబ్ది పొందిన వారు చివరి రోజుల్లో శేషగిరిరావు పైనే విష ప్రచారం చేయడాన్ని జీర్ణించుకోలేకపోయారని ఆయన అంతరంగికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన అధికార పక్షం కంటే ప్రతిపక్షం గానే ఉండి పనులు చేయించే వారని అనుచరులు వ్యాఖ్యానించారు.

***పాడి మోసిన నామా, వద్దిరాజు...***

రాయల శేషగిరిరావు మరణ వార్త తెలియగానే బీఆర్ఎస్ ఎంపి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రాయల



అంతిమయాత్రలో పాల్గొని పాడెను మోసి రాయలపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. శేషగిరిరావుతో వారికున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య శేషగిరిరావు పార్థీవదేహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డా శ్రీను, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, డి. వెంకటలాల్, మువ్వా మురళీధరరావు, కేతినేని చలపతి, కాపా వీర కృష్ణారావు, బద్దం కోటిరెడ్డి, జట్పిటిసి దిరిశాల ప్రమీల, దిరిశాల దాసూరావు, దిరిశాల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

***పువ్వాడ, కూనంనేని నివాళులు...***

శేషగిరిరావు పార్థీవదేహానికి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ



జాతీయ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోట్రు ప్రసాద్, భాగం హేమంతరావు, ఐజేయూ జిల్లా కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావులు నివాళులర్పించారు.

***పువ్వాళ్ళ నివాళులు....***

శేషగిరిరావు పార్థీవదేహానికి డిసిసి అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, మట్టా దయానంద్ విజయ్‌కుమార్, డిసిసిబి డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, జక్కంపూడి కృష్ణమూర్తి, దొడ్డా పుల్లయ్య, దుండేటి వీరారెడ్డి, ఐలూరి వెంకట కోటారెడ్డి, కాపా సుధాకర్, దీవెల కృష్ణయ్య, సామినేని రామప్పారావు, దగ్గుల రఘుపతిరెడ్డి, కొమ్మినేని ప్రభాకరరావు, కొమ్మినేని విద్యాసాగర్, అనుమోలు బుద్దిసాగర్ , కొమ్మినేని వెంకటేశ్వర్లు, తదితరులు నివాళులర్పించారు.

***అధికారుల నివాళులు....***

శేషగిరిరావు పార్థీవదేహానికి ఇండస్ట్రీయల్ జిఎం కె. అజయ్‌కుమార్, తల్లాడ, దమ్మపేట



ఎంపిడిఓలు ఎం. చంద్రమౌళి, బి. రవీంద్రారెడ్డి, ఏన్కూరు మండల పరిషత్ సూపరెండెంట్ తుమ్మలపల్లి కృష్ణ నివాళులర్పించారు.

***బిజేపి, టిడిపి సంతాపం...***

టిడిపి రాష్ట్ర కార్యదర్శి కేతినేని హరీష్ బిజేపి పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోదరావులు శేషగిరిరావు చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన కుమారులను పరామర్శించారు. ఈ సందర్భంగా శేషగిరిరావుతో ఉన్న అనుబంధాన్ని కేతినేని హరీష్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దూపాటి భద్రరాజు, చల్లా నాగులు, కేతినేని పృధ్వి, ఆపతి వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ పైన సర్కారు వివక్ష

### కార్పొరేషన్‌కు నిధులు మరిచారు

<u>*బోనకల్, మే16, ప్రభాతవార్త*</u>

ఎస్సీ కార్పొరేషన్‌పైన సర్కారు వివక్ష చూపుతుందని బాహటంగా చర్చ జరుగుతోంది. ఒక పక్క సర్కారు బడుల్లో చదువుకున్న నిరుద్యోగులు కార్పొరేటర్ మార్కులతో పోటీ పడలేక ఉద్యోగాలు రాక కనీసం బ్యాగ్‌లాగ్ పోస్టులైనా విడుదల చేస్తారేమోని గత పదేళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాగ్‌లాగ్ పోస్టులను విడుదల చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తున్నాయి. కనీసం స్వయం ఉపాధి కల్పించడం లోనయినా ఆసక్తి చూపడకపోవడం దళితులకు శాపంగా మారింది. స్వయం ఉపాధితో కుటుంబాలను పోషించుకుందామని ఆశ పడుతున్న ఎస్సీ నిరుద్యోగుల ఆశలపై నీళ్ల చల్లుతుంది. దళితుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. ఉన్నత చదువులు చదివిన మానవ వనరులు సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 35 ఏండ్లుపైబడిన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడకుండా వారి భవిష్యతును అంధకారంలో నెట్టివేసింది. దీంతో ఆ ప్రభుత్వాన్ని నిరుద్యోగ లోకం, ప్రజలంతా కలిసి ఓడించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెనెక్కించారు. ప్రస్తుతం నిరుద్యోగుల ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఉన్నాయనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

ఎస్సీ కార్పొరేషన్‌లో 2019 నుంచి లోనులు మంజూరి అయి చెక్‌లు కూడా ఇష్యూ అయి రుణాలు ఖాతాల్లో పడక లబ్దిదారులు ఏండ్లుగా ఎదురు చూస్తునే ఉన్నారు. కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టుగా దళిత బంధు పథకం మాటున ఐదున్నర ఏండ్లుగా ఎస్సీ కార్పొరేటషన్‌లో ఎంపిక అయిన లబ్దిదారులకు దళిత బంధు సాకుతో నిధులు మంజూరు చేయకుండా కాలం సాగదీశారు. గత ఐదు సంవత్సరాల నుంచి నేటి వరకు నిధుల మంజూరీ కాలేదు. జిల్లాలో సింహాభాగం ఉన్న దళితులు అభ్యున్నతిని రాజ్యాంగం కల్పించిన అవకాశాలను పాలకులు అమలు చేయడంలో విఫలమవుతున్నారని దళిత సంఘాలు, మేధావులు చర్చించుకుంటున్నారు. ఖాజానా ఖాళీ సాకుతో సంవత్సరాల తరబడి నిధులు మంజూరు చేయకుండా దళిత సమాజాన్ని ఇంకా అభివృద్ధికి దూరం చేస్తున్నారు. దళిత నిరుద్యోగుల పరిస్థితి మరీ దారుణం. ఎన్నికల అపుడు నాయకులు మాటల కోటలు కడతారు, కానీ అమల్లో చిత్తశుద్ధి అవగింజంతైనా లేదన్నది నగ్న సత్యం.

***ఉమ్మడి కుటుంబాల్లో నివసించే వారికి ఇంత వరకు ఇండ్లు లేవు, రేషన్ కార్డులు లేవు. లోన్లు లేవు. అంతా లాటరీ పద్ధతి.***

దళితులను సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ఎస్సీ కార్పొరేషన్ ఏర్పాటు విధితమే, దీని ప్రధాన ఉద్దేశం దళిత కుటుంబాలను, వ్యక్తులను సమూహాలను ఆర్థికంగా అభివృద్ధి చేయడం, రుణాలను మంజూరు చేయడం, స్కిల్స్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ కార్యక్రమాల నిర్వహణ కోసం ఏర్పాటు చేశారు. కాని అవి సక్రమంగా అమలు కావడం లేదని దళితులలో గుణాత్మక అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ఎస్సీ కార్పొరేషన్ విమర్శలు ఎదుర్కొంటున్నది. అధికారుల అసలత్వమా, ప్రభుత్వ ఉదాసీనత వైఖరా అర్థం కావడం లేదని వాపోతున్నారు. గత ప్రభుత్వం దళితబంధు ఆశ చూపించి మీ సేవల్లో తలా వెయ్యి ఖర్చు చేయించింది. చివరకు అది కాస్తా ఓట్ల దండకంగా మారిన సంగతి విధితమే. ఎస్సీ లబ్దిదారులకు నిధులు మంజూరు చేయకుండా అన్ని దళిత బందే అని అన్నీ బందు పెట్టింది. కొత్తగా కొలువు తీరిన కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు సమకూరుస్తుందా, లేక మరో దళిత బంధుకు శ్రీకారం చుట్టి పక్కన పెడుతుందా అని దళితులు చర్చించుకుంటున్నారు. దళితుల్లో చాలామంది నిరుపేదలే సామాజికంగా, ఆర్థికంగా వెనుకడిన వారే ఉన్నారు. ఆస్తులు లేక ఉద్యోగాలు లేక ఉన్నత చదువులు చదివి ఉపాధి లేక నిరుద్యోగ భృతి కూడా రాక కరువు పనులకు పోతూ కుటుంబాలు పోషించుకుంటున్నారు. అలాంటి యువతకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు మానవ వనరులను ఉత్పాదక రంగంలో వినియోగించక పోవడం వలన యువత చెడు వ్యసనాలకు లోనై కుటుంబాలు చిన్నాభిన్న అవుతున్నాయి. కుటుంబాలకు అండగా ఉండి వృత్తి నైపుణ్యం కలిగిన దళితులు నిరాశలో ఉన్నారు. సాక్షాత్తు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నిధుల మంజూరులో దళిత కుటుంబాల అభివృద్ధిలో చొరవ తీసుకుంటారని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

# నేరాలు-దారుణాలు

## చోరీకి గురైన ఇనుప సామాగ్రి పట్టివేత



<u>*పాల్వంచ క్రైం, మే 16 - ప్రభాతవార్త:*</u>

పాల్వంచ కేటీపీఎస్ నుంచి సుమారు రూ.2 లోల వ్యయంతో ఇనుప సామాగ్రిని దమ్మపేట సెంటర్‌లోని సాయిరాం ఐరన్ (పాత ఇనుప కొట్టు)కు తరలిస్తుండగా అసిస్టెంట్ కమాండెంట్ అప్పాజీ ఆదేశాల మేరకు ఆర్ఐ కరుణాకర్ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌ని పట్టుకున్నారు. ఎస్‌పీఎఫన సిబ్బంది, పాల్వం పట్టణ ఎస్సై బాణాల రాముకు సమాఆచరం ఇవ్వడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## లారీ డ్రైవర్ ప్రాణాలు కాపాడిన రెస్క్యూ టీం





<u>*రుద్రంపూర్, మే 16 - ప్రభాతవార్త:*</u>

సింగరేణి రెస్క్యూ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను ప్రాణాలు కాపాడారు. పాల్వంచ నవభారత్ కంపెనీ వద్ద రెండు లారీలు ఎదురెదురుగా వచ్చి ఢీ కొట్టుకున్నాయి. దీంతో ఒక లారీలో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు సింగరేణి రెస్క్యూ టీంకు తెలియజేశారు. రెస్క్యూ మేనేజర్ అనంతరామయ్య నేతృత్వంలో బ్రిగేడియర్ మెంబర్లు జోసఫ్ కిషోర్, హీరాలాల్, సాయిసందీప్, నాగేశ్వరరావులు అక్కడికి చేరుకొని అధునాతన యంత్రాలతో క్యాబిన్‌ను కట్ చేసి డ్రైవర్‌ను బయటికి తీశారు. ప్రథమ చికిత్స అంనతరం డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు.

## యార్లగడ్డ భాస్కర్‌కు ఘన నివాళులు

<u>*దమ్మపేట, మే 16 ప్రభాతవార్త:*</u>

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కా మ్రేడ్ యార్లగడ్డ భాస్కరరావుకు పలువురు నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఇటీవల యార్లగడ్డ మరణించగా గురువారం జరిగిన దశదిన కార్యక్రమంలో సిపిఐ శ్రేణులతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన యార్లగడ్డ భాస్కరరావు స్మారక స్థూపం వద్ద కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు యార్లగడ్డకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ క్రమంలో కార్మికులు, పేద ప్రజల కోసం యార్లగడ్డ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఎర్రజెండా అండతో ఎల్లప్పుడు పేద ప్రజల కోసం పోరాటాలు, ఉద్యమాలు చేస్తూ పేద ప్రజల పక్షపాతిగా సిపిఐలో పనిచేసిన నిస్వార్థ కమ్యునిష్టు నాయకులు యార్లగడ్డ అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగం హేమంత్‌కుమార్, పోటు ప్రసాద్, షాబీర్ పాషా, సయ్యద్ సలీమ్, అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు సోయం వీరభద్రం, వాడె వీరాస్వామి, యార్లగడ్డ బాబు, నర్సయ్య, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రుడు నడయాడిన నేలలో రమేష్‌చంద్ర ఎమర్జెన్సీ వైద్యసేవలు

## వైద్య దంపతులిద్దరూ ఏజెన్సీ ప్రాంత ప్రజల సేవకులే..

**ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏజెన్సీలో మొట్టమొదటిసారిగా ఐసీయూ పెట్టిన ఘనత**

**అందుబాటు ధరలతో అధునాతన వైద్యసేవలు**

**12 సంవత్సరాలుగా మచ్చలేని వైద్యుడిగా కీర్తి**









**భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :**

భద్రాచలం ఏజెన్సీలోని ఒక వైద్యశాల ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులను ఆకర్షిస్తుంది. ఈ వైద్యుడి హస్తవాసి మంచిదంటూ పలువురు ఏజెన్సీ వాసులు సైతం కితాబు నిస్తుంటారు. విష జ్వరాలు, ఫయిజనింగ్, అన్ని ఎమర్జెన్సీ కేసులు ఆత్మాహత్యాయత్నాలకు పాల్పడిన వారు వంటి తదితర క్రిటికల్ కేసులను ఇతర వైద్యులు మా వల్ల కాదు.. హైద్రాబాద్, విజయవాడ లలోని కార్పొరేట్ ఆసుపత్రులకు తీసుకుని వెళ్ళాల్సిందే అన్న కేసులను కూడా ఈ వైద్యుడు సాహోపేతంగా స్వీకరించి సకాలంలో అత్యవసర చికిత్స అందించి రోగిని సాధారణ స్థితి వచ్చే వరకు కృషి చేసి సఫలీకృతం అవుతారని, ఎంతటి నయం కాని వ్యాధి అయినా తమకు అందుబాటు ధరలతో అధునాతన వైద్యసేవలు అందించే వైద్యుడిగా అందరి మన్ననలు పొందడం ఈ వైద్యుడికి పరిపాటే. ఆయనే. “డా.ఏ.రమేష్‌చంద్ర” క్రిటికల్ కేర్ స్పెషలిస్టు. భద్రాచలం పట్టణంలోని వివిధ ప్రదేశాలలో వైద్యశాలలను నిర్వహించిన ఈ వైద్యుడు ఇటీవల మరిన్ని అధునాతన వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకుని వచ్చి ఆకర్షణీయ హంగులతో నూతనంగా పట్టణంలోని చర్ల రోడ్డులో డా.రమేష్ ఐ అండ్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ వైద్యుడి సతీమణి అయిన డా.నీలిమ కూడా ప్రముఖ కంటి వైద్యురాలుగా పేరొందని వ్యక్తి కావడం కొసమెరుపు.

ఏజెన్సీలో ఆదివాసీలు, గిరిజనులు, కొండరెట్లు అధికంగా నివసించే ప్రాంతం. అధిక శాతం వీరు పౌష్టికాహార లోపంతో అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటూ బాధపడుతుంటారనే విషయం విధితమే. అనారోగ్యానికి గురైన వ్యాధిగ్రస్తులు వివిధ సందేహాల మూలంగా ఆందోళనకు లోనై భయబ్రాంతులకు గురై ఈ వైద్య దంపతుల వద్దకు వచ్చినప్పుడు సన్న పా బ. ా వంతో మాట్లాడుతూ ముందుగా వ్యాధిగ్రస్తులలో మనోధైర్యాన్ని పెంపొందించి ఆత్మస్థైర్యాన్ని నింపి మంచి చికిత్స అందిస్తారని పలువురు ప్రశంసిస్తుంటారు. రోగుల పట్ల ఆసుపత్రిలోని సిబ్బంది సైతం మర్యాదపూర్వకంగా నడుచుకుంటూ, వ్యాధిగ్రస్తుల ఆరోగ్య స్థితిగతులను 24 గంటలు కంటిపై కునుకు లేకుండా గమనిస్తూ వైద్యసేవలు అందించి ఎంతటి వ్యాధిని అయినా నయం చేస్తారని పలువురు కొనియాడుతుంటారు. కేవలం ప్రధాన పట్టణాలకే పరిమితమైన అధునాతన పరికరాలతో కూడిన వైద్యాన్ని ఏజెన్సీ ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వచ్చి మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రజల ఆదరణ ఈ వైద్యదంపతులు పొందడం పరిపాటే. మొట్టమొదటిగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత వైద్యశాలలో కెల్లా మొదటి సారి ఇన్‌టెన్‌సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ), కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ సేవలను వీరి ఆసుపత్రిలోనే ప్రారంభించి గత 12 సంవత్సరాలుగా వైద్య సేవలను అందిస్తున్నారంటే అతిశయోక్తి కలుగకమానదు.



24/7 అందుబాటులో ఉంటూ ఎంతటి వ్యాధిని అయినా నయం చేయగలిగే సామర్థ్యం ఉన్న వైద్యుడిగా డా.ఏ.రమేష్‌చంద్ర (ఎం.బీ.బీ.ఎస్, డీ.ఏ, సీ.సీ.ఈబీ.డీ.ఎం) జనరల్, షుగర్ మరియు ఎమెర్జెన్సీ వైద్య నిపుణులు మన్యం వాసుల మన్ననలు పొందుతుంటారు. ఆత్మావాత్యయత్నం కేసులను, విషజ్వరాలను, ఫైజనింగ్ వంటి కేసులను సాహసోపేతంగా ఎదుర్కోవడంలో వైద్యదురంధరుడు. ఈయన ధైర్యానికి తగ్గట్లుగానే ఒక్క కేసు కూడా ఫెయిల్ కాకపోవడం గమనార్హం. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మరింత అందుబాటులో మెరుగైన వైద్యం అందించడం కోసం నెఫ్రాలజీ, జనరల్ సర్జన్, డయాలసిస్, లాప్రోస్కోపిక్ సర్వీసులను వీరి నూతన ఆసుపత్రిలో ప్రారంభించారు.

### -నేత్రవైద్యచికిత్సలో డా.నీలిమ దిట్ట

ఇటీవల కాలంలో ప్రజలలో వయస్సుకు సంబంధం లేకుండా చూపు మందలించడం వంటి సమస్య ప్రధానంగా నెలకొంది. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు ఈ సమస్య వెంటాడుతూనే ఉంది. గతంలో భద్రాచలం ఏజెన్సీలో డా.శ్యాంప్రసాద్ నేత్రవైద్యచికిత్స చేయడంలో పేరుగాంచిన వైద్యుడు. ఆయన తదానంతరం నేత్రవైద్యచికిత్సలో అనేకమంది చూపును మెరుగుపరిచి మన్యం ప్రజల మన్ననలు అందుకున్నది డా.కే.నీలిమ (ఎం.బీ.బీ.ఎస్, డీవో)(డీఎన్‌బీ) కంటి మరియు, ఫాకో సర్జన్ వైద్య నిపుణురాలు. కంటి శుక్లాలు, తదితర నేత్ర శస్త్ర చికిత్సలు చేయడంలో ఈమె దిట్ట. వీరి ఆసుపత్రిలోనే కావాల్సిన కళ్ళజోళ్ళను సైతం అందుబాటులో ఉంచడం గమనార్హం.

### -నిష్ణాతులైన వైద్యులచే వైద్యసేవలు

అదేవిధంగా వీరి ఆసుపత్రిలో నిష్ణాతులైన వైద్యులచే మరిన్ని వైద్య సేవలను అందుబాటులోకి తీసుకుని వచ్చారు. ఆర్.వాసవి (ఎండీఎస్) డెంటల్ సర్జన్, ఫ్లోస్టోడాంటిస్ట్ వైద్య నిపుణులు, డా.పవన్‌కుమార్ (ఎం.డీ, డీఎం న్యూరో) న్యూరాజలజిస్ట్ వైద్య నిపుణులు, డా.బాలభాస్కర్‌రెడ్డి (ఎం.ఎస్, యూరో) యూరాలజిస్ట్ వైద్య నిపుణులు, డా.జె.భాస్కర్ (ఎం.ఎస్, జనరల్ సర్జన్) జనరల్ మరియు లాప్రోస్కోప్ సర్జన్, డా.పీ.రాహుల్ (ఎం.డీ, డీఎన్‌బీ నెఫ్రో) కిడ్నీకేర్ మరియు డయాలసిస్ వైద్య నిపుణులు, డా.బాబురావు (ఎం.డీ, చెస్ట్), ఊపిరితిత్తుల వైద్య నిపుణులు, డా.ఎస్.సీతారెడ్డి (ఎంబీబీఎస్, ఎం.డీ, గైనకాలజిస్ట్) స్త్రీల మరియు ప్రసూతి వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారు.

వీరి ఆసుపత్రి వద్ద అన్ని రకాల మెడికల్ సర్జికల్ ఎమర్జెన్సీలు, 24/7 ఇంటెన్సీన్ క్రిటికల్ కేర్ యూనిట్ (ఐసీయూ), లాప్రోస్కోపిక్ లేజర్ సౌకర్యం, నెఫ్రాలజీ డయాలసిస్ యూనిట్, ప్రసూతి వైద్యులు, గైనిక్ సేవలు, 24/7 ల్యాబ్ సౌకర్యం, వెంటిలేటర్ అంబులెన్స్ సౌకర్యం కలదు.

### -భద్రాద్రి రాముని ఆశీసులతో మరిన్ని వైద్య సేవలు అందిస్తాం

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆశీస్సులతో మరిన్ని వైద్య సేవలను ఆదివాసీలకు, నిరుపేద ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని డా.ఏ.రమేష్‌చంద్ర ప్రభాతవార్తకు తెలిపారు. వైద్యం అనేది వృత్తిలా కాకుండా ప్రజలకు మంచి చేయడమే పరమావధిగా సామాజిక బాధ్యతగా తీసుకుని వైద్యసేవలు అందిస్తున్నామని అన్నారు. చాలా మంది నిరుపేద దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తమ వద్దకు వచ్చి సమస్య చెప్పగానే చలించి అతి తక్కువ ఫీజుతో వ్యాధిగ్రస్తుడిని ఆసుపత్రిలో అడ్మిట్ చేయించుకుని ఆ వ్యాధి నయం అయ్యే వరకు బాధ్యత తీసుకుంటామని అన్నారు. అదేవిధంగా వ్యాధిగ్రస్తులకు అన్ని రకాల వైద్యపరీక్షలు సైతం ఆసుపత్రిలోనే అందుబాటులో ఉన్నాయన్నారు. సకాలంలోనే రిపోర్టులు వస్తాయని, రిపోర్టుల ఆధారంగా మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. ఆ శ్రీసీతారామచంద్రస్వామి వారి చల్లని చూపు మాపై ఉండడం వలన ప్రజలకు సేవ చేయగలుగుతున్నామని, మరిన్ని సేవలను అందిస్తామని అన్నారు.

---

# ఈ నెల 20వ తేదీలోపు మరమ్మతు పనులు పూర్తి చేయాలి

**- ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్**

**పాల్వంచ రూరల్, మే 16 - ప్రభాతవార్త:**

గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు పాఠశాల, వసతి గృహాల్లో మైనర్ రిపేర్లు , ప్యాచ్ వర్క్, డ్యూయల్ డెస్కు బల్లలు రిపేర్లు ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో రిపేర్లు చేయించి విద్యార్థులకు పనికి వచ్చే విధంగా స్పెషల్ ఆఫీసర్లు, హెచ్‌ఎంలు శ్రద్ద తీసుకోవాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం పాల్వంచ మండలంలోని కిన్నెరసాని బాలుర ఆశ్రమ పాఠశాల, పాల్వంచలోని బాలికల వసతి గృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.



పాఠశాలలోని టాయిలెట్లు, వాష్ రూములు, డార్మెటరీ తరగతి గదులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆశ్రమ పాఠశాలలను తమ ఇంటిని ఏ విధంగా శుభ్రపర్చుకుంటామో అదే విధంగా పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు ఉన్నందున తిరిగి పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పాఠశాలలకు సంబంధించిన ప్యాచ్ వర్కులు, మైనర్ రిపేర్లు, ప్రతీ తరగతి గదిలో డైనింగ్ హాల్, డార్మెటరీలలో గాలి, వెలుతూరు సక్రమంగా వచ్చేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. డ్యూయల్ డెస్కు బల్లలు పాడైపోతే వెంటనే రిపేర్లు చేయాలని, ముఖనయంగా విద్యార్థులకు టాయిలెట్లు, వాష్ రూములలో అపరిశుభ్రత లేకుండా శుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు. ఫ్లోరింగ్ పగుళ్లు తేలి ఉండటంతో తప్పనిసరిగా ప్యాచ్ వర్కు చేయించాలని, టాయిలెట్ వాషన రూముల్లో యాసిడ్‌తో శుభ్రం చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని అన్నారు. పాఠశాల తరగతి గదుల్లో మరింత డార్మెటరీలలో చీమలు ఎక్కువగా తిరుగుతున్నాయని, చీమలు రాకుండా లక్ష్మణరేఖ అయినటువంటి కాయిల్స్ ద్వారా చీమల రాకుండా నిర్మూలించాలని అన్నారు. పాఠశాల గోడల పైన పనికిరాని చెట్లు మొలుస్తున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని అన్నారు. పిల్లలు బట్టలు ఉతుక్కున్నతర్వాత ఆరవేసుకోవడానికి జియో వైరుతో బయట దండాలు కట్టేయాలని, వాష్ రూమ్, టాయిలెట్లకు డోర్లు పాడైపోతే రిపేరు చేయించాలని అన్నారు. ఆయన వెంట డీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణుమ్మ, హెచ్‌ఎం చందు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫామ్ అందజేయడానికి ప్రణాళికాబద్ధ కార్యచరణ చేయాలి

**- జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్**



**ఖమ్మం, మే16, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల, గురుకులాల విద్యార్థులకు యూనిఫామ్ అందజేయడానికి ప్రణాళికబద్ధ కార్యచరణ చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. గురువారం నూతన కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో అధికారులతో విద్యార్థుల యూనిఫామ్ అందజేతపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలు గురుకులాల్లో చదివే విద్యార్థులందరికి యూనిఫామ్ అందజేయడానికి విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో మొత్తం 2,48,837 మంది విద్యార్థులు ఉండగా, ఇందులో 1,15,980 మంది బాలురు, 1,32,857 మంది బాలికలు ఉన్నారన్నారు. మహిళ సమైఖ్య సంఘాలతో యూనిఫామ్ కుట్టడానికి కార్యచరణ చేయాలన్నారు. ప్రతి విద్యార్థి కొలతలు తీసుకొని అందుకు తగ్గట్టుగా యూనిఫామ్ తయారు కావాలన్నారు.1185 మంది మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులను యూనిఫామ్‌లు కుట్టడానికి గుర్తించామన్నారు. పాఠశాలల్లోనే కుట్టుకేంద్రాలు ఏర్పాటు చేసి నిర్ణీత సమయంలోగా యూనిఫామ్‌లు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, డిఆర్డీఓ సన్యాసయ్య,డిఇఓ సోమశేఖర శర్మ, ఏపిడి నూరోద్దీన్, ఆర్ఎంఓ రాజశేఖర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాన్‌స్టిక్ వద్దు - ఆరోగ్యానికి ముప్పు

**రసాయనాలు వెలువడే ప్రమాదం**

**వంట పాత్రలపై విషవాయువులు**

**ఆహార మార్గదర్శకాల పేరుతో నష్టం**

**ప్రత్యామ్నయంగా గ్రానైట్ పాత్రలు మేలు**





**రఘునాథపాలెం, మే 16, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో పూర్వీకుల కాలం నుంచి ఆనవాయితీగా రాతిండి పాత్రలో వంటలు చేయడం ఆచారంగా వస్తుంది. పెరుగుతున్న టెక్నాలజీకి అనుగుణంగా క్రమేపి అలాంటి రాతిండి పాత్రలో వంటలు చేయడం కనుమరుగయ్యాయి. పల్లెసీమల్లో ఆరుబయట కట్టెలపొయ్యి, పిడకలు పొయ్యి మీద రాతిండి పాత్రలో అన్నం, కూరలు వాటికి సంబంధించిన ఆహారపదార్థాలు తయారు చేసేవారు. వీటితో పాటు మట్టి కుండల్లో కూడా అన్నం వండిన సందర్భాలు గతంలో ఉన్నాయి. కొంత మంది ఇత్తడి పాత్రలు సైతం వంటలకు ఉపయోగించేవారు. తాజాగా అలాంటి పాత్రలకు స్వస్తి పలికిన గృహిణులు ఆన్‌లైన్ వైపు దృష్టి మళ్లించి వివిధ రకాల నాన్‌స్టిక్‌లు కోసం ఆర్డర్ పెట్టడం మరోవైపు సమీపంలోని దుకాణాల వద్దకు వెళ్లి నేరుగా కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసిన ప్రతి ఇంట్లో నాన్‌స్టిక్ లేకుండా వంట తయారు చేయడం లేదు. నాన్‌స్టిక్‌తో ఆరోగ్యానికి ముప్పు అని తెలిసినప్పటికి ఇండ్లలోని గృహిణులు మాత్రం వాటిని ఆకర్షిస్తున్నారు. ఈనాన్‌స్టిక్‌ల్లో వంటలు తయారు చేసిన అనంతరం వాటిని శుభ్రం చేసే సమయంలో గీతలు పడితే విషవాయువులు రసాయనాలు వెలువడే ప్రమాదం ఉందని తద్వారా ఆరోగ్యానికి ముప్పు అని తెలుస్తోంది. ఒక్క నాన్‌స్టిక్‌పై ఒక్క గీత నుంచి 9వేల మైక్రో ప్లాస్టిక్ రేణువులు ఉంటాయని వంట పాత్రలతో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలుస్తోంది. నాన్‌స్టిక్ వంట పాత్రలపై చిన్న గీత పడిన దాని మీద ఉన్న పైపూత కోటింగ్ నుంచి వివిధ రకాల విష, రసాయనాలు వెలువడి ఆహర్యంలో కలుస్తాయని ఐసిఎంఆర్ విడుదల చేసిన ప్రకటన బట్టి చూస్తే ఇలాంటి ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లు అవుతుంది. నాన్‌స్టిక్ పాత్ర మీద ఒక్క గీత నుంచి కనీసం 9,100 మైక్రో ప్లాస్టిక్ రేణువులు విడుదలవడంతో పాటు 170డిగ్రీల సెల్సియస్ కన్నా అధిక ఉష్ణోగ్రత వంట చేసినప్పుడు ఈ ప్రమాదం ఉంటుందని అద్యాయనంలో వెల్లడైంది.ఈ లెక్కన వీటి నుంచి కొన్ని లక్షల మైక్రో ప్లాస్టిక్స్ గీతల వల్ల విడుదలయ్యే ప్రమాదం ఉంది. వీటి మూలంగా హార్మోన్లలో అసమతుల్యత కాన్సర్, సంతానోత్పత్తి సమస్యలు వంటివి తలెత్తవచ్చు అని తెలుస్తోంది.నాన్‌స్టిక్ పాత్రలు బదులు మట్టి పాత్రలో వంట తయారు చేసుకోవడం అత్యంత సురక్షితమని ప్రత్యామ్నయంగా గ్రానైట్ పాత్రలు కూడా ఉపయోగించుకోవడం ఆరోగ్యానికి మంచిది. ఫుడ్ గ్రేడ్ స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు కూడా గృహిణిలు వంట తయారు చేయడంలో దృష్టి సారిస్తే ఆహార మార్గదర్శకాల్లో ప్రాణపాయ నుంచి ఆనారోగ్యభారీన పడకుండా ఎలాంటి వ్యాదులు సంక్రమించకుండా ఆరోగ్యంగా జీవించడానికి సులువుగా ఉంటుంది.ఈ సమాచారాన్ని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ విడుదల చేస్తూ ఈ హెచ్చరిక జారీ చేసింది.

# మణుగూరులో పట్టభద్రులు 3,092 మంది ఓటర్లు

**-మూడు పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు**

**-మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి**

**మణుగూరు, ప్రభాతవార్త, మే 16 :** పట్టభద్రుల ఎమ్మెల్యే నియోజకరవ్గం నల్గొండ, ఖమ్మం, వరంగల్ పరిధిలోని మణుగూరు మండల కేంద్రంలో మూడు పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మణుగూరు ప్రభుత్వ జెడ్పీ కో ఎడ్యూకేషన్ హై స్కూల్ నందు పీఎస్ నెం.239, 240,241 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో మొత్తం 3,092 ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. మహిళలు 1,374, పురుషులు 1,718 మొత్తం 3,092 ఉన్నారని, 239 పోలింగ్ కేంద్రంలో 981 మంది, 240 పోలింగ్ కేంద్రంలో 1043, 241 పోలింగ్ కేంద్రంలో 1068 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు ఆయన తెలిపారు.




**ఖమ్మం, కార్పొరేషన్, రఘునాథపాలెం, కల్లూరు, ఖమ్మం రూరల్**



# బీజేపీ గ్రాఫ్ పెరిగింది

**ఆత్మీయ సమ్మేళనంలో తాండ్ర వినోద్‌రావు**

**ఖమ్మం, మే 16, ప్రభాతవార్త:** ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపి గ్రాఫ్ గణనీయంగా పెరిగిందని ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. బిజేపి ఈ ఎన్నికల్లో గెలవబోతుందని చెప్పారు. ఖమ్మంలోని సప్తపది ఫంక్షన్‌హాల్‌లో గురువారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్త ఎన్నికల్లో తన వంతు కృషి చేస్తానని చెప్పారు. రాజకీయాలు, మతాలకు అతీతంగా ఖమ్మం సమగ్ర అభివృద్ధి కోసం యుద్ధం చేశామని, ఇందులో మనం గెలుస్తున్నామన్నారు. బీజేపి, టిడిపి, జనసేన, ఎంఆర్‌పిఎస్ కలిసికట్టుగా ఎన్నికల్లో పనిచేశాయన్నారు. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఒక ఫేస్ అయిపోయింది. రెండో ఫేస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తర్వాత స్థానిక సంస్థలు, ఎన్నికలు ఉన్నాయని, ఆ ఎన్నికల్లో తన భాగస్వామ్యం ఉంటుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ మీరంతా ఎంపీ అభ్యర్థులేనని పార్టీ అభ్యర్థి అనడంతో ప్రతి ఒక్కరు పట్టుదలతో పనిచేశారని ప్రశంసించారు. ధర్మానికి, అధర్మానికి, నీతికి, అవినీతికి ఈ ఎన్నికలని తాండ్ర తెలిపారని అన్నారు. అంతేగాక తాను ఖమ్మం ప్రజలను నమ్ముకున్నాను. కాంగ్రెస్, బీఆర్ఎస్ డబ్బు సంచులు నమ్ముకున్నారని తెలియజేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ మాదిగ, బీజేపి రాష్ట్ర జిల్లా నాయకులు నేరెళ్ల శ్రీనివాస్, శ్యామ్, సరస్వతి, విజయారెడ్డి, టిడిపి నాయకులు హరీష్, పృథ్వి, ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి మాచర్ల క్రాంతి, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**-మణుగూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్**

**మణుగూరు, ప్రభాతవార్త, మే 16 :**



జిల్లాలోని 2024-25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో వివిధ ట్రేడ్‌ల్లో ప్రవేశం పొందుట కొరకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మణుగూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ బి.ప్రభాకర్ అన్నారు. ఆయన గురువారం మణుగూరు ప్రభుత్వ ఐటీఐలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 15 నుండి వచ్చే నెల 10 వరకు ఐటీఐలో ప్రవేశం కొరకు ధరఖాస్తులు చేసుకోవాలని కోరారు. 10వ, 8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అందరూ ఐటీఐ కోర్సులో ప్రవేశం పొందేందుకు ధరఖాస్తులు చేసుకోవడానికి 1 ఆగస్టు 2024 నాటికి 14 సంవత్సరాలు వయస్సు నిండిన వారు అర్హులన్నారు. ఆపై ఏ వయస్సు వారైన అర్హులే అన్నారు. ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్‌లో విద్యార్థులు ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికేట్లు స్కాన్ చేసి వాటిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

## జాతీయ డెంగ్యూ దినోత్సవం... దోమల అంతం

- మన పంతం దోమలు కుట్టకుండా... పుట్టకుండా ఫ్రైడే డ్రైడే పాటించాలి



చంద్రుగొండ, మే 16 - ప్రభాతవార్త:

జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ కే. తనూజ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ చంద్రుగొండలో జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డెంగ్యూ ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ జ్వరాలు రావడానికి కారణాలు, వ్యాధి లక్షణాలు, దానివల్ల జరిగే పరిణామాలను వివరించారు. దోమలను నిర్మూలించడం, దోమ కాటు నుంచి రక్షించుకోవాలని అన్నారు. ఖాళీ కొబ్బరిబొండాల్లో, కూలర్లు, ఇతర ఖాళీ ప్లాస్టిక్ డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. ఎప్పటికప్పుడు వాటిని శుభ్రం చేసుకోవాలని అన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ నర్సు శోభారాణి, ఫార్మాసిస్టు లక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్ ఇమాం, హెచ్‌వీ పద్మ, ఏఎన్‌ఎంలు రమణమ్మ, పుల్లమ్మ, శ్రీదేవి, రాధ, శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

## 10 కేజీల వలలు, ఉచ్చులు స్వాధీనం



లక్ష్మీదేవిపల్లి, మే 16 - ప్రభాతవార్త:

అటవీ జంతువులను వేటాడేందుకు వేటగాళ్లు అమర్చిన 10 కేజీల ఉచ్చులు, వలలను, వాణాలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్ఆర్వో శ్రీనివాసరెడ్డి, ఎఫ్ఎస్వో క్రాంతి, అనూష, శారద, రమేషన, జగ్గాలు ఎఫ్‌బీవోల, బేస్ క్యాంపు వాచర్లతో కిన్నెరసాని ఎఫ్‌డీవో బాబుతో కలిసి తెల్లవారు జామున జరిపిన దాడిలో వీటిని స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణాలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి చర్యలకుపాల్పడేవారిపైకఠినచర్యలు ఉంటాయన్నారు.

## నూతన అదనపు జిల్లా కోర్టుల సముదాయం కోసం పర్యవేక్షణ

- పర్యవేక్షిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెం లీగల్, మే 16 - ప్రభాతవార్త:

జిల్లా కోర్టు భవన సముదాయంలో నూతనంగా నిర్మించే జిల్లా కోర్టుల నిర్మాణం కోసం ఆర్అండ్‌బీ అధికారులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ గురువారం పర్యవేక్షించారు. ఆర్అండ్‌బీ అధికారులకు తగిన సూచనలు చేశారు. రెండు అదనపు జిల్లా కోర్టుల నిర్మాణం జరిగితే జిల్లా వాసులకు సత్వర న్యాయ పరిష్కారం అందుబాటులోకి రానున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఎన్‌డీ సాధిక్‌పాషా, న్యాయవాదులు గాజుల రాంమూర్తి, మెండు రాజమల్లు, గడదేశి కాంతయ్య, వడ్లకొండ హరిప్రసాద్, మేకల దేవేందర్‌లు పాల్గొన్నారు.

## సీపీఐలో భారీ చేరికలు



కొత్తగూడెం, మే 16 - ప్రభాతవార్త:

సీపీఐ జిల్లా కార్యాలయంలో రామాంజనేయ కాలనీ నుంచి పలువురు సీపీలో చేరారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పార్టీలో చేరిన బషీర్, యాకూబ్, యాకూబ్ ఖాన్, మగ్బుల్, షరీఫ్‌తో పాటు 20 కుటుంబాలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, సీపీఐ కౌన్సిలర్ యూసుఫ్, లింగేష్‌లు పాల్గొన్నారు.

## జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం



కొత్తగూడెం, మే 16 - ప్రభాతవార్త:

జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సంఘాల సమావేశాన్ని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఇంటినంబర్ లేని గృహాలకు యూసర్ చార్జెస్ వసూలు చేసి ఇంటి నంబర్, కరెంట్ మీటర్లు పొందే విధంగా చూడాలని అన్నారు. జిల్లా పంచాయతీ అధికారిని కోరారు. జిల్లాలో పరిశ్రమలను నూతనంగా ఏర్పాటు చేయడానికి వంద ఎకరాల భూమి కోసం ప్రతిపాదనలు చేయాలని అన్నారు. జిల్లాలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. రాబోయే వర్షాకాలంలో ప్రజలకు అంటు వ్యాధులు రాకుండా ముందుగా శానిటేషన్ పనులు చేయించాలని, అందుకు ముందస్తు ప్రణాళికను తయారు చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీలు, జెడ్పీ సీఈవో ప్రసూనరాణి, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## హెడ్డాఫీస్ ముందు ఆమరణ నిరాహార దీక్ష

కొత్తగూడెం అర్బన్, మే 16 - ప్రభాతవార్త:



సింగరేణి ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌లో పోస్టు పెంచకపోతే సింగరేణి హెడ్డాఫీస్ ముందు తెలంగాణ ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో నిరుద్యోగులతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని సింగరేణి యాజమాన్యాన్ని తెలంగాణ ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, యువజన, విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ కోరారు. ఈ మేరకు సింగరేణి సీఎండీ బలరాంను కలిసి వినతి పత్రాన్ని అందించారు. సింగరేణి వ్యాప్తంగా సింగరేణి వివిధ ఏరియాలలో పనిచేయడానికి కావాల్సిన కార్మికుల కోసం ఎగ్జిక్యూటివ్ నాన్ ఎగ్జిక్యూటివ్ రంగాల్లో ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని, ఆ నోటిఫికేషన్ హైకోర్టు తీర్పు ప్రకారం ఎక్స్‌టర్నల్ పోస్టులు చాలా తక్కువగా ఉన్నాయని, వెంటనే పోస్టులను పెంచాలని లేకపోతే నిరుద్యోగులతో కలిసి పెద్ద ఎత్తున సింగరేణి హెడ్డాఫీస్‌ను ముట్టడిసానతమని అన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయించిన శ్రీలక్ష్మీ సీడ్స్‌పై చర్యలు తీసుకోవాలి



కొత్తగూడెం, మే 16 - ప్రభాతవార్త:


రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించిన శ్రీలక్ష్మీ సీడ్స్ ఫెర్టిలైజర్ సీడ్స్ వారిపై కఠిన చర్యలు తీసుకొని వారి లైసెన్సును రద్దు చేసి అమాయక రైతులను మోసం చేసిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ కోరారు. గురువారం డీఏవో బాబురావును కలిసి వినతి పత్రాన్ని అందించారు. పాల్వంచ మండలం కోడిపుంజుల వాగు గ్రామానికి చెందిన సుమారు 40 మంది రైతులకు శ్రీలక్ష్మీ సీడ్స్ వరి విత్తనాలు విక్రయించిందని, రైతులు నష్టపోయారని, అలాంటి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తేజావత్ సాదు, తేజావత్ మంగా, అజ్మీరా కృష్ణ, భూక్యా బాలు, ఆంగోత్ మోతీలాల్, మంగ్యా పాల్గొన్నారు.




చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్

## నేటి నుంచి పది రోజుల పాటు సినిమాలు బంద్

కొత్తగూడెం, మే 16 - ప్రభాతవార్త:



ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ బిజీగా ఉండటం వల్ల, వేసవికాలం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున థియేటర్లలో ప్రజల నుంచి సరైన ఆదరణ లేనందున తెలంగాణ రాష్ట్రం ఫిలిం ఎగ్జిబీటర్స్ అసోసియేషన్ నిర్ణయం మేరకు జిల్లాలో రేపటి నుంచి పది రోజులు థియేటర్లలో సినిమాలు ప్రదర్శన నిలిపివేస్తున్నామని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు తెలిపారు. పది రోజులు థియేటర్లలో సినిమా ప్రదర్శన ఉండదని, అసౌక ర్యానికి ప్రజలు సహకరించాలని థియేటర్స్ యాజమాన్యాల తరఫున కోరారు.

## పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

- కమిషనర్‌ను కలిసిన వ్యాపారస్తులు



కొత్తగూడెం మున్సిపాలిటీ, మే 16 - ప్రభాతవార్త:

జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని ప్రధాన వ్యాపార కూడళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పట్టణ వ్యాపారస్తుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, డీఈ, టీపీవోలతో మాట్లాడారు. పెద్దబజార్, చిన్న బజార్ రోడ్లు, డ్రైనేజీలు, ఎలక్ట్రికల్ పోల్స్, సులాభ్ కాంప్లెక్స్, రైతుబజార్‌లో పెయిడ్ పార్కింగ్, వివిధ సమస్యలపై చర్చించడం జరిగిందని అన్నారు. వారు స్పందించి తప్పకుండా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు కంభంపాటి దుర్గాప్రసాద్, మొరిశెట్టి భవాని ప్రసాద్, పల్లపోతు వాసు, ఆబిద్, కూరా శ్రీధర్, ముక్కా మధు, అనూప్ ఖండేల్వాల్, బోగా ప్రేంకుమార్, మనీష్‌కుమార్ అగర్వాల్, పల్లపోతు సాయి, మొరిశెట్టి అనీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను మరోసారి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ



కొత్తగూడెం అర్బన్, మే 16 - ప్రభాతవార్త:

రైతులను కాంగ్రెస్ పార్టీ మరోసారి మోసం చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వనమా రాఘవేందర్‌రావు అన్నారు. కొత్తగూడెం కొత్తగూడెం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద నాయకులు నిరసన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం రూ.500 అధనంగా బోనస్ ఇస్తానని రైతులకు చెప్పి ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి వంకలు పెట్టడం సరికాదని అన్నారు. రైతులకు న్యాయంజరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు. రైతులకు రూ.500 రూపాయలు బోనస్ ఎటువంటి వంకలు పెట్టకుండా వెంటనే చెల్లించాలని, మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ, వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, ఎంపీపీలు బదావత్ శాంతి, భూక్యా సోనా, కొట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




## మున్నూరు కాపులకు అన్ని పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలి

భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :




భద్రాచలం మున్నూరు కాపు సంఘ సమావేశం ఆ సంఘ నియోజకవర్గ ఇంచార్జ్ ధనపనేని వెంకటేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు డా.పీ.రాజశేఖర్, పట్టణ అధ్యక్షుడు తమ్మళ్ళ వెంకటేశ్వరరావు (టీ.వీ) ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య మాట్లాడుతూ .. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరు కాపులకు దామాషా ప్రకారం టికెట్లు పొందడం కోసం, కులస్తులలో చైతన్యం కలిగించే విధంగా చేపట్టినటువంటి చైతన్య యాత్ర భద్రాచలంలో ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని, త్వరలోనే కార్పొరేషన్‌కు నిధులు కేటాయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిపారు. నిధులు సమకూరిన తరువాత నిరుపేద విద్యార్థులు, యువతకు మెరుగైన అవకాశాలు కల్పించబడతాయని అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరు కాపులకు అన్ని పార్టీలు అధిక స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వల్లాల ప్రసాదరావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరిలు యూ.ఎస్.ప్రకాష్‌రావు, వాసాల వెంకటేశ్వరరావు, జిల్లా కన్వీనర్ ఆది కోటేశ్వరరావు, బూర్గంపహాడ్ మండల అధ్యక్షుడు వరాల వేణు, జిల్లా కో. కన్వీనర్ లంక నరసింహారావు, వెంకటాపురం మండల అధ్యక్షుడు శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డా.తెల్లంను అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి



భద్రాచలంటౌన్, ప్రభాతవార్త :

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరావు సమక్షంలో భద్రాచలం శాసనసభ్యుడు డా.తెల్లం వెంకట్రావు, పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికలలో నియోజకవర్గంలో కష్టపడి పనిచేసిన ఎమ్మెల్యేలను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. అనంతరం భద్రాచలం నియోజకవర్గంలో పలు సమస్యలను డా.తెల్లం వెంకట్రావు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్ళగా సానుకూలంగా స్పందించిన సీఎం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వీరి వెంట మువ్వా విజయ్‌బాబు, తుళ్ళూరి బ్రహ్మయ్య, ఎం.డీ.నవాబ్‌లు ఉన్నారు.

## కన్నులపండువగా రామయ్య కళ్యాణం

భద్రాచలంకల్చరల్, ప్రభాతవార్త :



భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి కళ్యాణం కన్నులపండుగగా సాగింది. ఉదయమే పవిత్ర గోదావరి నదీ తీరం నుండి తీర్థపు బిందెలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు నడుమ నదీ జలాలను తీసుకుని శ్రీస్వామి వారి మూలవరులకు, ఉత్సవమూర్తులకు అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీలో భక్తుల జయ జయ ధ్వానాల నడుమ శ్రీస్వామి వారి ఉత్సవమూర్తులను బేడా మండపానికి తీసుకుని వచ్చి ఆశీనులను చేశారు. అర్చకస్వాములు ముందుగా శ్రీస్వామి వారి సహస్ర నామార్చన, తదుపరి క్షేత్ర మహాత్యాన్ని భక్తులకు వివరించారు. కళ్యాణతంతులో భాగంగా శ్రీస్వామి వారికి విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచన, శ్రీస్వామి వారి, అమ్మవార్ల ప్రవరలు, యోత్రధారణ, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, మహాసంకల్పం, మంగళాష్టకాలు, చూర్ణిత, సుముహూర్తం, మాంగళ్యపూజ, మాంగళ్యధారణ, అక్షతారోపణ, వేదాశీర్వచనం, మంగళాశాసనంతో కళ్యాణతంతు ముగిసింది. కళ్యాణం జరుగుతున్నంత సేపు కళ్యాణంలో పాల్గొన్న దంపతులు కన్నులారా శ్రీసీతారామచంద్రస్వామి వార్లను చూస్తూ తరించిపోయారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలకు తన్మయత్వంతో పులకరించిపోయారు. అనంతరం కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు దేవస్థాన సిబ్బంది కళ్యాణలడ్డూ, శ్రీస్వామి వారి వస్త్రాలు, అక్షతలు పంపిణీ చేశారు.

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

బూర్గంపహాడ్ ప్రభాతవార్త:



ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్, పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన ముస్లిం మైనార్టీ విద్యార్థినీలకు మజీద్ ఏ దావత్ సారపాక కమిటీ, ముస్లిం మైనార్టీ పెద్దలు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించి ప్రోత్సహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ గీత పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్తులో కూడా ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలని ఎంతో మంది ఆదర్శంగా నిలవాలని, ముస్లిం మహిళలు కూడా దేనికి తీసి పోరనే విధంగా ఎదగాలన్నారు. అదేవిధంగా మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ జూనియర్ కాలేజీలలో ఎక్కువ మంది విద్యార్థినీలు చేరే విధంగా గ్రామ ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ సభ్యులు మహబూబ్ అలీ, తాజుద్దీన్, రజాక్, ముస్తఫా, మైనార్టీ పెద్దలు, రిటైర్డ్ ఎంఈఓ ఖాసీం, అబ్దుల్ అలీమ్, షఫీ, పాషా, షేక్ అబ్దుల్ సలీం, న్యూ సెంచరీ కరస్పాండ్ ఆశిక్, భాషరత్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌ని కలిసిన సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాము

బూర్గంపహాడ్ ప్రభాతవార్త:



పిన పాక నియోజకవర్గం సోషల్ మీడియా కోఆర్డినేటర్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ మాదాపూర్ వేదికగా హోటల్ దస్పల్లాలో నిర్వహించిన నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ల సమీక్షా సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో కలిసి భోజనం ఫోటో సెషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. నియోజకవర్గాల వారగా ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవారికి అందే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## మున్నూరు కాపుల అభివృద్ధే ధ్యేయం

చర్ల ప్రభాతవార్త:



చర్ల శ్రీనివాస కళ్యాణ మండపంలో గురువారం చర్ల మండల మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు విస్సా నాగభూషణం అధ్య క్షతన మున్నూరు కాపు సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్ ముఖ్యఅతిథిగా విచ్చేసారు. అలాగే రాష్ట్ర కార్యదర్శి వల్లాల ప్రసాద్ రావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యు ఎస్ ప్రకాష్ రావు, వాసాల వెంకటేశ్వరరావు, భద్రాద్రి జిల్లా కన్వీనర్ ఆది కోటేశ్వరరావు, కో కన్వీనర్ లంక నరసింహారావు, జిల్లా నాయకులు జోగం తారక రామారావు, డివిజన్ నాయకులు దున్నపునేని వెంకటేశ్వరరావు అతిథులుగా హాజరైయ్యారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలలో మున్నూరు కాపుల ప్రాధాన్యత గురించి, మున్నూరు కాపు కార్పొరేషన్ గురించి పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల ప్రధాన కార్యదర్శి గుండెపుడి భాస్కరరావు, బండారు రామకృష్ణ, మేడిచర్ల ఎడ్ల సత్తిబాబు, జవ్వాది మురళీకృష్ణ, బిట్రగుంట క్రాంతి కుమార్, పెద్దాడ ఆశాలత, ముత్యాల రాణి, ఆవుల శివప్రసాద్, పటేల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు ఏమన్నా ఉంటే తన దృష్టికి తీసుకురండి

### -ఉపాధి పనులను పరిశీలనలో ఎంపిడీవో ఈదయ్య

చర్ల ప్రభాతవార్త:



ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో ఈదయ్య పరిశీలించారు. మొగళ్లపల్లి జీపీ పల్లి గ్రామాలలో గురువారం ఉదయం జరిగిన పనులను పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందు వలన వీలైనంత త్వరగా ఉదయమే పనులు ప్రారంభించాలని, కూలీలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీవో వలి, పంచాయతీ సెక్రెటరీ ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరు కాపులకు అవకాశాలు కల్పించాలి

దుమ్ముగూడెం, ప్రభాతవార్త :




తెలంగాణ రాష్ట్రంలోని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరు కాపు కులానికి చెందిన వారికి అవకాశలు కల్పించాలని మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని చిన్న బండిరేవు గ్రామంలో మున్నూరుకాపు సంఘ సమావేశం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో కొండ దేవయ్య పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపు ఫైనల్స్ కార్పొరేషన్‌ను ఏర్పార్చి నిధులు మంజూరు చేసిందని, ఆ నిధులను మున్నూరు కాపు కులానికి చెందిన విద్యార్థులు, మహిళలు, చిరు వ్యాపారుస్తులకు ఉపయోగపడేలా విధి విధనాలు రూపొందిస్తున్నామని ఆయన తెలిపారు. భవిష్యత్‌లో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరు కులానికి చెందిన ఔత్సాహితులు పోటీలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి వీ.ప్రసాదరావు, జిల్లా కన్వీనర్ కోటేశ్వరరావు, ఆర్గనైజర్ సెక్రెటర్ వీ.వెంకటేశ్వర్లు, లంక నరసింహ రావు, పూదోట సూరిబాబు, పతివాడ జగదీష్, లంక శ్రీనివాసరావు, బిల్లా చంద్రశేఖర్, కొమ్ము బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పోడు విధ్వంసంపై ట్రిబ్యునల్ సీరియస్



**పత్రికా కథనాలే సుమోటోగా కేసు నమోదు**

**తెలంగాణా సర్కార్‌కి ఎన్‌జిటి నోటీస్‌లు**

**వన్యప్రాణి మనుగడకోసం ఆందోళన**

**వలస పోడు ప్రమాదాన్ని ఆరాతీసిన బెంచ్**

**అశ్వారావుపేట-ప్రభాతవార్త**

తెలంగాణాలోని వలస పోడు విధానాలు., దరిమిలా ఏర్పడుతున్న జీవవైవిధ్య విధ్వంసాల పై నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్‌లో కేసు నమోద యింది. ఒక ప్రముఖ జాతీయ దినపత్రికలో 15.03.2024 న ప్రచురితమైన కథనానికి స్పందించి "సుమోటోగా" ఎన్‌జిటి విచారణకు సీ వ్కరించి, తెలంగాణా సర్కార్‌కి నోటీస్‌లు జారీచేయడం నిజంగా ఆసక్తికర అంశమే. "అడవి కుదించుకుపోతున్నదని అందువల్ల బిగ్‌క్యాట్ జాతి అంతరించి పోతున్నదని" ఆ పత్రిక హెడ్డింగ్ పెట్టి అనేక పర్యావరణ అంశాలను ప్రస్తావించింది. "బిగ్‌క్యాట్" అంటే పిల్లి జాతికి చెందిన మొత్తం 8విభిన్న క్యాటగిరిలో సింహం, పెద్దపులి, చిరుతలు, కూడా వస్తాయి. అంతే కాకుండా తెలంగాణా భౌగోళిక స్వరూప రీత్యా మొత్తం భూవిస్తీర్ణంలో 24.07శాతం అటవీ ప్రాంతముండగా, వలస పోడు విధానం మితిమీరుతున్న కారణంగా అనేక అనర్థాలు పొంచి ఉన్నాయని అందులో ఆందోళన వ్యక్తం చేశారు. నిషేధిత కేంద్ర రిజర్వ్‌ఫారెస్ట్ ఏరియాలో నిబంధనలకు విరుద్ధంగా పారిశ్రామిక విస్తరణ, సివిల్ వర్కులు పెరిగిపోవడం, హద్దులు దాటిన మైనింగ్, విచక్షణ మరచి భారీ వృక్షాల నరికివేత, దీంతో వన్యప్రాణుల అంతర్ధానం వంటి అంశాలపై ఆ వ్యాసం కలమెత్తింది. ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ అటవీప్రాంతాన్ని మచ్చుకి ఉదహరిస్తూ పర్యావరణాన్ని మింగేందుకు సిద్ధమైన ప్రళయాన్ని కళ్ళముందుంచారు. ఈ ఒక్క జిల్లాలోనే 15254 దరఖాస్తులకు 44750 ఎకరాల అటవీ భూమిని ప్రభుత్వం పంచిపెట్టిందని, జాతీయ అటవీహక్కుల చట్టంద్వారా పట్టాలిచ్చారని అందులో వివరించారు. ఈ చట్టాన్ని అమలు చేయడం తప్పని వీళ్ళు అనడం లేదు. ఐతే దీన్ని అడ్డుపెట్టుకుని సాగిస్తున్న ఉల్లంఘనలపై మాత్రమే దండెత్తారు. అదేమంటే.,"వలస పోడు" విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అంటే ఒకచోట అడవిని నరికేసి, అక్కడ కొంతకాలం వ్యవసాయం చేసి, మళ్ళీ మరో ప్రాంతానికి తరలివెళ్ళి తిరిగి వృక్షాల నరికివేత వంటి అనాగరిక పద్ధతులపై నిలదీశారు. దీంతోపాటు నేషనల్ ఫారెస్ట్‌డ్వెల్లర్స్ ఏక్ట్-2016 నిబంధనల్లోకి రానివారికి కూడా పెద్దఎత్తున దొడ్డిదారిన పోడు హక్కులు కల్పించడం వంటి గతితప్పిన పాలనావిధానాలతో ఉన్నకాస్త అడవులు కూడా అంతర్ధానమయ్యే ప్రమాదం సమీపిస్తున్నదని ఆ ప్రముఖ పత్రిక అంతర్లీన అభిప్రాయం. ఇండియన్ ఫారెస్ట్‌ఏక్ట్ 1980-ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ఏక్ట్-1986 ప్రకారం ఈ పర్యవసానాలపై జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఢిల్లీ విభాగం కేసు నమోదు చేసింది. తెలంగాణా ప్రభుత్వ ప్రిన్సిపల్ ఛీఫ్ కన్సర్వేటర్ ఫర్ ఫారెస్ట్, ఛీఫ్‌వైల్డ్ వార్డెన్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ తదితర అధికారులను ప్రతివాదులుగా చేరుస్తూ నోటీస్‌లు జారీ చేశారు. ఓఎ నెంబర్:243/2024 ద్వారా ద్విసభ్య బెంచ్ ప్రకాష్‌శ్రీవాస్తవ (ఛైర్‌పర్సన్), డాక్టర్ ఎ.సెంథిల్‌వెల్ (ఎక్స్‌పర్ట్‌మెంబర్), డాక్టర్ అఫ్రోజ్‌అహ్మద్ (ఎక్స్‌పర్ట్‌మెంబర్), లు కేసు రిజిస్టర్‌చేసి ప్రతివాదులకు తాఖీదులు జారీచేయడమే కాకుండా, ఈ కేసుని చెన్నయ్ సౌత్‌జోన్ కి బదిలీచేసి 26.04.2024 తేదీన సర్కార్ కౌంటర్‌కోసం లిస్ట్ చేశారు.

ఆతేదీనుంచి మళ్ళీ వాయిదా పడింది. సరే వాదోపవాదాలన్నీ పూర్తయి ఈ విషయంలో పర్యావరణానికి ఏమేరకు న్యాయం జరుగుతుంది, గిరిజన సమూహాలతోపాటు సమాజంలోని కొందరు బడాబాబుల స్వార్థ ప్రయోజనాలకన్నా పర్యావరణ ప్రయోజనాలే ప్రధానమనే పరివర్తన ఎప్పుడొస్తుంది, అది వస్తేనే కదా మంచి జరిగేది లేకపోతే, కోర్టులు చేయగలిగేది ఏముంటుంది అనే నిర్వేదం సహజమే అయినా, ఎక్కడోచోట ఇలాంటి తొలిఅడుగు పడాలి కదా. ప్రస్తుతానికి ఇది ఒక్క ఆసిఫాబాద్ కే పరిమితమైనప్పటికీ, ఇక్కడ ఏదైనా కట్టడిమార్గం దొరికితే రాష్ట్రమంతటికీ ఇదే న్యాయం వర్తిసుంది కదా.

పోడు జారీలో మన రాష్ట్రం 7.14లక్షల ఎకరాలకు పట్టాలిచ్చి మూడవ స్థానంలో ఉంటే, 9.02లక్షలతో మధ్యప్రదేశ్ మొదటి, 8.98 లక్షల ఎకరాలతో చత్తీస్‌గర్ రెండవ స్థానంలో నిలిచింది.



## స్ట్రాంగ్ రూమ్‌లను నిరంతరం పర్యవేక్షించాలి

**ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్**

**ఖమ్మం, మే 16, ప్రభాతవార్త:**



ఇవిఎం యంత్రాలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌లను నిరంతరం పర్యవేక్షించాలని ఖమ్మం పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జిల్లా కలెక్టర్ విపిగౌతమ్ తెలిపారు. గురువారం రిటర్నింగ్ అధికారి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలను సందర్శించి, స్ట్రాంగ్ రూమ్ పర్యవేక్షణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, అశ్వారావుపేట, కొత్తగూడెం అసెంబ్లీ సెగ్మెంట్ల ప్రక్రియ శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతుందని, ఈ ఆసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి పోలైన ఈవీఎం యంత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చామని అన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 3 అంచెల పటిష్ట భద్రత వ్యవస్థ ఏర్పాటు చేశామని, అనుమతి లేకుండా ఎవరు లోపలికి వచ్చే వీలు లేదని అన్నారు. స్ట్రాంగ్ రూమ్ పూర్తి కవరేజితో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని, వీటి ద్వారా స్ట్రాంగ్ రూమ్‌లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అన్నారు. రిటర్నింగ్ అధికారి స్ట్రాంగ్ రూములకు వేసిన సీల్‌లను పరిశీలించి సంబంధిత రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా భూగర్భ జలశాఖ అధికారి శ్యామ్ ప్రసాద్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, సిబ్బంది హుస్సేన్, భద్రత అధికారులు, అధికారులు తదితరులు వున్నారు.

# పట్టభద్రుల ఉప ఎన్నిక ఏర్పాట్లు వేగవంతం చేయాలి



**ఈ నెల 27న ఎన్నికలు - జూన్ 5న కౌంటింగ్**

**జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వి.పి.గౌతమ్**

**ఖమ్మం, మే 16, ప్రభాతవార్త:**

వరంగల్-ఖమ్మం-నల్గొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక ఏర్పాట్లు వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వి.పి.గౌతమ్ అన్నారు. గురువారం నూతన కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో పోలింగ్ అధికారుల నియామకం ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక పోలింగ్ ఈనెల 27న, కౌంటింగ్ జూన్ 5న ఉన్నట్లు తెలిపారు. పోలింగ్ కు పోలింగ్ సిబ్బంది నియామకం చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 118 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన అన్నారు. 142మంది పివోలు, 142 మంది ఏపివోలు, 284 మంది ఓపిఓలు అవసరం ఉన్నట్లు ఈ దిశగా సిబ్బంది ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను పోలింగ్ విధులకు నియమించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణకు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఏఆర్వోలతో సమావేశమై ఏర్పాట్ల గురించి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుందున ఏ దశలోనూ తప్పిదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 83879 మంది పట్టభద్రుల ఓటర్లు నమోదుకాగా, ఇందులో 50676 మంది పురుషులు, 33199 మంది మహిళలు, 4గురు ట్రాన్స్‌జెండర్లు ఉన్నార న్నారు. రిజర్వ్‌తో కలుపుకొని 129 బ్యాలెట్ బాక్సులు అవసరం ఉందని ఆయన తెలిపారు. 15 ఫ్లయింగ్ స్క్వాడ్, 24ఎంసిసి, 24 ప్రత్యేక వీడియో బృందాలు ఏర్పాటు చేసి నిఘా పకడ్బందీగా చేపట్టాలన్నారు. సెక్టార్ అధికారుల నియామకం పూర్తి చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవోలు, తహశీల్దార్లు సందర్శన చేసి వసతుల కల్పన చూడాలన్నారు. బ్యాలెట్ పత్రాల తనిఖీకి బృందం పోలీస్ గార్డ్‌తో వెళ్లి తీసుకొని రావాలన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీ ఎంతో ముఖ్యమని ఓటరుకు తమ ఓటు హక్కు ఎక్కడ ఉందో తెలియాలని కావున 100శాతం ఓటరు స్లిప్పుల పంపిణీ చేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఉంటుందని, రిసెప్షన్ కేంద్రం నల్గొండలో వుండనున్నట్లు ఆయన అన్నారు. రూట్ల ఏర్పాటుకు కార్యచరణ చేసి రవాణా ప్రణాళిక చేయాలన్నారు. బందోబస్తు చర్యలు పకడ్బందీగా చేపటాటలన్నారు. సమావేశంలో అద నపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జిల్లా విద్యా ధికారి సోమశేఖర శర్మ, జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, ఎల్డిఎం శ్రీనివాసరెడ్డి, ఎస్టీసి రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, కలెక్టరేట్ ఏవో అరుణ, సూప రింటెండెంట్లు మదన్‌గోపాల్,

రాంబా బు, సత్యనా రాయణ, ఎంవిఐ వెంకట రమణ, ఎస్బి ఇన్‌స్పెక్టర్ సతీష్, ఎన్‌ఐసి కోఆర్డి నేటర్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, ప్రభాతవార్త, మే 16 :**



రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని గురువారం హైద రాబాద్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీని వాస రెడ్డితో పాటు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కలిశారు. ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గంలో లోక్ సభ ఎన్నికల్లో కష్టపడి పని చేసిన ఎమ్మెల్యే పాయంను సీఎం అభినం దించారు. పినపాక నియోజకవర్గం అభివృద్ధి గురించి చర్చించినట్లు, అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందజేసేందుకు సానుకూలంగా సీఎం స్పందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ పాల్గొన్నారు.



# మండలంలో ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

**వేసవిలో జన జాతరలా పాల్గొంటున్న కూలీలు**

**పనులను పర్యవేక్షించి సంతృప్తిని వ్యక్తం చేసిన ఏపీడి, ఎంపీడీవో, ఏపీవో**

**పథకంపై క్షేత్రస్థాయిలో అవగాహన పరుస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ లు**

**పని ప్రదేశంలోనే కూలీలకు తాగునీరు, నీడ, వైద్య సదుపాయం**



***కామేపల్లి, మే 16 ప్రభాతవార్త:***
కామేపల్లి మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకం పనులలో 5800 నుండి 6000 వరకు కూలీలు పాల్గొంటున్నారు.చెరువులో పూడికతీత, గుట్ట చుట్టు కందకాలు,ఫీడర్ ఛానల్, చెక్ డ్యామ్‌లలో పూడికతీత తదితర పనులు కూలీల భాగస్వామ్యంతో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అట్టి పనులను ఎంపీడీఓ జి.రవీందర్, ఏపీఓ అద్దంకి



శ్రీరాణి, ఈసీ దామల్ల వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్, బావ్ సింగ్, డేవిడ్ రాజు, సుప్రియ, ఫీల్డ్ అసిస్టెంట్లు పరిశీలించి ప్రతిరోజు కూలీలకు 300 రూపాయల వేతనం పొందేలా కూలీలకు పని ప్రదేశం లో అవగాహన కల్పిస్తున్నారు.ఫ్లెక్సీలను సైతం ఏర్పాటు చేసి కొలతలు, ఎంత పనిచేయాలనే విషయమై అవగాహన కల్పిస్తూ చైతన్య పరుస్తున్నారు. మార్కింగ్ ఇచ్చి కూలీలకు పని కల్పిస్తున్నారు.కూలీలకు సకాలంలో వేతనాలు అందడం వలన ఎక్కువ మొత్తంలో కూలీ లు ఉపాధి హామీ పనులకు ఎక్కువ సంఖ్యలో హాజరు అవుతున్నారు.కామేపల్లి మండలం లోని గోవింద్రాల, కామేపల్లి, నెమలిపురి, కొమ్మినేపల్లి,



లింగాల,జాస్తిపల్లి పంచాయతీ లలో అమృత్ సరోవర్ పనులను ఏపీడి వెంకటపతి రాజు, కోర్స్ డైరెక్టర్ గాలయ్య పరిశీలించి డోన్ కెమెరా ద్వారా ఫోటోలు తీయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీరాణి, ఈసీ దామల వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్, భావ్



సింగ్, డేవిడ్ రాజు, సుప్రియ, ఫీల్డ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.

# కామేపల్లి పిహెచ్‌సి ని ఆకస్మికంగా సందర్శించిన డిప్యూటీ డిఎంహెచ్వో

***కామేపల్లి, మే 16 ప్రభాతవార్త:***
కామేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఖమ్మం డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ బెజవాడ సైదులు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాల నిర్వహణ, సిబ్బంది పనితీరు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పర్యవేక్షించి సంతృప్తిని వ్యక్తం చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు, రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వడదెబ్బ బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు.మాతా శిశు మరణాలను నియంతించాలని



అన్నారు.గర్భిణీ మహిళల నమోదు వివరాలను డాక్టర్ నెల్లూరి చందన ను అడిగి తెలుసుకున్నారు.గర్భిణీ మహిళలు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పు చేయించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ నెల్లూరి



చందన, సి హెచ్ ఓ కె.సుధారాణి, హెచ్ వి ఆర్.రమణ, హెల్త్ సూపర్వైజర్ నరేంద్రనాయక్, స్టాఫ్ నర్స్ పుష్పలత, వైద్య సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ కల్లూరి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు వరి కొయ్యలను కాల్చవద్దు

**-ఏ పంటకైనా నేల ఆరోగ్యం ప్రధానం- పచ్చిరొట్ట ఎరువుల వలన ప్రయోజనం అధికం**

**- మట్టి నమూనాల సేకరణ పై క్షేత్రస్థాయిలో అవగాహన- ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన జెడిఏ ఎం.విజయనిర్మల**

***కామేపల్లి, మే 16 ప్రభాతవార్త:***
రైతులు పంటలు కోసిన తరువాత వరి కొయ్యలు,పంట వ్యర్థాలను కాల్చవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల కోరారు.క్షేత్ర పర్యటనలో భాగంగా కామేపల్లి మండల పరిధిలోని గ్రామాల్లో గురువారం విస్తృతంగా పర్యటించి రైతులకు వరి కొయ్యలను కాల్చడం వలన కలిగే అనర్థాలను వివరించి





చైతన్యపరిచారు.రైతులు వరి కొయ్యలను కాల్చడం వలన పంటలకు బస్తాల కొలది రసాయనికి ఎరువులు కుమ్మరించిన ఆశించిన స్థాయిలో దిగుబడులు రావని తెలిపారు.అలా చేయవద్దని వ్యవసాయ శాఖ పరంగా సిబ్బంది రైతులకు పలుమార్లు విన్నవించినా వారు వినిపించుకోకపోవడం తగదని అన్నారు.ఏ పంటకైనా నేల ఆరోగ్యం ప్రధానమన్నారు.పశువులు, కోళ్లు, గొర్రెల ఎరువు వేసి పంట అవశేషాలను కలియ దున్నడం, పచ్చిరొట్ట ఎరువు వలన భూమిలో సేంద్రీయ కార్బన్ ఏర్పడుతుందన్నారు.సూక్ష్మజీవులు నేల ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు.భూమిలో సహజ సిద్ధంగా ఉండే నత్రజని, భాస్వరం, పొటాష్



వంటి పోషకాలను ఎప్పటికప్పుడు మొక్కలకు అందిస్తూ పెరుగుదలకు సహకరిస్తాయన్నారు.మట్టి నమూనాలు సేకరించు విధానంపై కూడా క్షేత్రస్థాయిలో రైతులకు నేరుగా అవగాహన కల్పించారు.అనంతరం ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిడీలర్లకు పలు సూచనలు చేశారు.ప్రధానంగా బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్, గోదాం లో ఉన్న ఎరువుల నిల్వలు, రికార్డులో ఉన్న ఎరువుల నిల్వలు కచ్చితంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి బి.తారా దేవి, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు షేక్ మున్ని, కే.ప్రతిభ, బి.జగదీష్, బి.మహేష్, జి.ఉష, బి.శ్రీకన్య, రైతులు సిహెచ్ బుచ్చయ్య, తుమ్మలపల్లి వీరయ్య, యడ్లపల్లి శేషగిరిరావు, తోటకూరి శ్రీనివాసరావు, చెరుకుమల్ల రాంబాబు, టి.వెంకటేశ్వర్లు, ఆర్.కోటయ్య ఆర్.వెంకటేశ్వర్లు, కే.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




**నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, తిరుమలాయపాలెం**

## డెంగ్యూ అవగాహన ర్యాలీ



***నేలకొండపల్లి, మే 16 ప్రభాతవార్త:***
జాతీయ డెంగ్యూ దినోత్సవంను పురస్కరించుకుని గురువారం నేలకొండపల్లి నందు పిహెచ్‌సి ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్‌లు ర్యాలీ నిర్వహించారు. కీటక జనతా వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారు నినాధాలు చేస్తూ ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా డెంగ్యూ వ్యాధి నివారణ కోసం వారు ప్రతిజ్ఞ చేసారు. అనంతరం, స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి రాకుండా ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు చేపట్టాలని ఆయన చెప్పారు. దోమల వలన వ్యాపించే డెంగ్యూ వ్యాధి రాకుండా ఉండాలంటే ప్రతి ఒక రు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన చెప్పారు. మురుగు నీరు నిల్వ లేకుండా చేసుకోవాలని ఆయన చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పిహెచ్‌సి సిహెచ్‌వో చావా దుర్గ, డిపిఎంవో సంధ్య, హెచ్‌ఇవోలు చంద్రశేఖర్‌రావు, బి.వీరన్న, పిహెచ్‌ఎన్ తిరుమలమ్మ, సూపర్‌వైజర్స్ తిరుపతమ్మ, శ్రీలక్ష్మి, ఏడుకొండలు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## వెంకటరత్నంకు ఉస్మానియా పిహెచ్‌డి లభ్యం

***నేలకొండపల్లి, మే 16 ప్రభాతవార్త:***
చెన్నారం గ్రామంకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ బట్టపోతుల వెంకటరత్నం ఉస్మానియా యూనివర్శిటి నుంచి ఎంసిఏ పిహెచ్‌డి సాధించారు. సికింద్రాబాద్ అల్వాల్ లోని లయోలా అకాడమీ డిగ్రీ, పిజి కళాశాల నందు బట్టపోతుల వెంకటరత్నం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేస్తున్నారు. అగ్రికల్చర్ డేటా నుండి తెగుళ్ళను వర్గీకరించడానికి డీప్ లెర్నింగ్ టెక్నిక్ స అనే శీర్షికతో వెంకటరత్నం ఉస్మానియా యూనివర్శిటీకి నివేదిక సమర్పించడంతో ఈ పిహెచ్‌డి లభించింది. పిహెచ్‌డి సాధించిన బట్టపోతుల వెంకటరత్నం గతంలో రాజేశ్వరపురం జెడ్పీఎస్ఎస్ హైస్కూల్ నందు పదవ తరగతి చదివారు. అలాగే, నేలకొండపల్లి లోని గౌతమీ జూనియర్ కళాశాల నందు ఇంటర్మీడియేట్, కోదాడ ఎంఆర్‌ఆర్ కళాశాల నందు డిగ్రీ, ఖమ్మం కవిత మెమోరియల్ పిజి కళాశాల నందు పిజి (ఎంసిఏ) పూర్తి చేసారు. ఎంసిఏ పిహెచ్‌డి సాధించిన బట్టపోతుల వెంకటరత్నంను చెన్నారం గ్రామంకు చెందిన పలువురు పెద్దలు, స్నేహితులు అభినందించారు.



## తాళ్ళూరి దర్గయ్య మృతి తీరని లోటు



తల్లాడ, మే 16, ప్రభాతవార్త

మండల పరిధిలోని అన్నారుగూడెంకు చెందిన ప్రముఖ జర్నలిస్టు తాళ్ళూరి దర్గయ్య మృతి తీరని లోటని సిపిఎం తల్లాడ మండల నాయకులు తాతా భాస్కర్‌రావు అన్నారు. గురువారం దర్గయ్య దశదిన కర్మ సందర్భంగా ఆయన దర్గయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, శీలం సత్యనారాయణరెడ్డి, పులి వెంకట నర్సయ్య, ముచ్చింతల చెన్నయ్య, తాళ్ళూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

## దర్గయ్యకు ఎంపిపి దొడ్డా నివాళులు



తల్లాడ, మే 16, ప్రభాతవార్త

ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మండల పరిధిలోని అన్నారుగూడెంకు చెందిన జర్నలిస్టు తాళ్ళూరి దర్గయ్య దశదిన కర్మకు ఎంపిపి దొడ్డా శ్రీనివాసరావు హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు దొడ్డా చిన్న శ్రీనివాసరావు, నాయకులు మారెళ్ళ దేవేందర్, అన్నారుగూడెం మాజీ రైతు సమన్వయ సమితి చైర్మన్ దుగ్గినేని సత్యనారాయణ, తాళ్ళూరి శ్రీనివాసరావు, దర్గయ్య కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

## డెంగ్యూ సోకకుండా జాగ్రత్తలు పాటించండి



బోనకల్, మే16, ప్రభాతవార్త

డెంగ్యూ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు పాటించాలని పిహెచ్‌సి వైద్యులు వి.ఇ.స్రవంతి అన్నారు. మండల కేంద్రంలోని పిహెచ్‌సిలో గురువారం జాతీయ డెంగ్యూ డే కార్యక్రమాన్ని పారామెడికల్ సిబ్బంది ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరుపున నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన ప్రదర్శన ఏర్పాటు చేసి డెంగ్యూ గురించి వివరించారు. కరపత్రాలు అందజేసి వివరించారు. డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా ప్రతి ఒక్కరు మంగళ, శుక్రవారాలు డీ వాటరింగ్ సంపూర్ణంగా చేయడం ద్వారా డెంగ్యూ వ్యాధి నుండి కాపాడుకోవచ్చన్నారు. దోమలు కుట్టకుండా, పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది పి.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు, సిస్టర్లు, ఆశాలు, పాల్గొన్నారు.

## డాక్టర్ మట్టా దయానంద్ పరామర్శలు, ఆశీర్వాదాలు



కల్లూరు, మే 16, ప్రభాతవార్త

రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ గురువారం కల్లూరు మండలంలో పర్యటించారు. కల్లూరు మేజర్ గ్రామానికి చెందిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బొడ్డు వెంకటేశ్వరరావు (స్వామి) కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే



లింగాల గ్రామానికి చెందిన కీశే. మట్టూరి మధుసూదనరావు దశదిన కర్మకు హాజరై వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే తాళ్ళూరి వెంకటాపురం గ్రామానికి చెందిన దిరిశనపు జ్ఞాన ప్రకాశం – సువార్త ల కుమారుడు అనిల్ కుమార్ – కీర్తి వివాహ కార్యక్రమంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధిపై అవగాహనా ర్యాలీ



తల్లాడ, మే 16, ప్రభాతవార్త

ప్రపంచ డెంగ్యూ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రత్న మనోహర్ ఆధ్వర్యంలో గురువారం అవగాహనా ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి నివారణకు దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయచందర్, సూపర్‌వైజర్లు పెద్ద పుల్లయ్య, మేరమ్మ, భద్రమ్మ, కళావతి, అమృతరాజు, నిర్మల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జక్కంపూడిని పరామర్శించిన ఐలూరి




తల్లాడ, మే 16, ప్రభాతవార్త

మండల పరిధిలోని బిల్లుపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కంపూడి కృష్ణమూర్తిని గురువారం డిసిసిబి డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఐలూరి వెంకటేశ్వరరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య యోగ క్షేమాలను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైరా మార్కెట్ కమిటి చైర్మన్ దీవెల కృష్ణయ్య, సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, ఐలూరి కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూర్

## విద్యుత్ సరఫరాకు ప్రత్యేక లైన్



కల్లూరు, మే 16, ప్రభాతవార్త

కల్లూరు విద్యుత్ ఉప కేంద్రం నుంచి చంద్రుపట్ల, రఘునాథగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా హెచ్చు తగ్గులు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కల్లూరు విద్యుత్ ఉప కేంద్రం నుండి మూడు కిలోమీటర్ల మేరా చంద్రుపట్ల వరకు 13 లక్షల విలువచేసే విద్యుత్ స్థంభాల తీగలు మంజూరు కాగా వాటితో కొద్ది రోజుల నుండి నిర్మాణాలు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారి గణేష్ తెలిపారు. 11 కెవి. విద్యుత్ సరఫరా లైన్ ఇప్పటికే పూర్తి కావచ్చిందని, మరి కొద్ది రోజుల్లో మూడు వలే మంది గృహ, వ్యవసాయ విద్యుత్ బోర్లకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదే విధంగా బత్తులపల్లి విద్యుత్ ఉప కేంద్రంలో కూడా వినియోగదారుల ఉపయోగార్ధమై నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు మరో నియంత్రిక మంజూరైనట్లు అది కూడా కొద్ది రోజుల్లో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. పల్లెల్లో, పట్టణంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా వినియోగదారులు ఇబ్బందులు పడకుండా విద్యుత్‌ను అందించేందుకు సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా సరఫరా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

## పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలి



మధిరరూరల్, మే 16, ప్రభాతవార్త:

పాఠశాలలు తెరిచేలోపు ఆగిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని టీఎస్ పీఆర్టీయూ ఆధ్వర్యంలో గురువారం విద్యాశాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంకు ఒక వినతిపత్రం సమర్పించారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పాఠశాలలు తెరిచేలోగా పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూర రగోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, పత్రిక ప్రధాన సంపాదకుడు ఇన్నారెడ్డి, సిద్ధిపేట, మేడ్చల్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు శశిధర్‌శర్మ, రామేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు ఆనంద్‌రెడ్డి, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డుపై పశు కళేబరం

కల్లూరు, మే 16, ప్రభాతవార్త

కల్లూరు మండలం చెన్నూరు, లింగాల గ్రామాల మధ్య ఉన్న ఆర్అండ్‌బి రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక పాడి గేదె మృతిచెందింది. సంబంధిత శాఖ ఆర్అండ్‌బి మరియు ఆ స్థలం చెన్నూరు గ్రామ పంచాయితీ పరిధిలోకి చెందిందని పంచాయితీ రాజ్ ఆర్అండ్‌బి శాఖల వారు ఎవరికీ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో వాహనదారులు, ప్రయాణీకులు రాకపోకలు చేస్తున్న బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. వారికి తెలిసినా చూసి చూడనట్లు ఉంటున్నారని వారు తెలుపుతున్నారు. గత రెండు రోజులుగా కళేబరం రోడ్డుపైన ఉండటంతో దుర్వాసన వస్తుండటంతో, రాత్రి కాల సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు జరగక మునుపే కళేబరమును తీసి వేసి ప్రమాదాల నుంచి రక్షించాలని, దుర్వాసన నుంచి కాడాపాలని కోరుతున్నారు.

## సమ్మర్ బాక్సింగ్ క్యాంపును పరిశీలించిన డీవైఎస్‌వో



**మంచిర్యాల, మే 16 - (ప్రభాతవార్త):** జిల్లా బాక్సింగ్ సమ్మర్ క్యాంపును డీవైఎస్‌వో వరదాధామరెడ్డి సందర్శించారు. సమ్మర్ క్యాంపు వచ్చిన పిల్లలకు మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ మట్టపర్తి మానస, శ్రీను, సత్యబాబు పాల్గొన్నారు. జిల్లా బాక్సింగ్ సెక్రటరీ మట్టపర్తి రమేష్, క్రీడాకారులు అభినందించారు. మంచిర్యాల హైస్కూల్‌లో ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు ఈ క్యాంపు కొనసాగుతుందని అన్నారు.

## సీపీఐ పార్టీలో చేరిన కౌన్సిలర్ ధర్మరాజు



**కొత్తగూడెం, మే 16 - (ప్రభాతవార్త):** పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమక్షంలో మున్సిపల్ పరిధిలోని 31వ వార్డు కౌన్సిలర్ కోలాపురి ధర్మరాజు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. సీపీఐ పార్టీలో చేరిన వారికి తామంతా అండగా ఉంటామని ఎమ్మెల్యే అన్నారు. కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సాబీర్‌పాషా, చంద్రగిరి శ్రీనివాసరావు, వెంకట్, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, యూసుఫ్, చారీ తదితరులు పాల్గొన్నారు.

## బీమా నగదు అందజేత

**ఎర్రుపాలెం, మే 16, (ప్రభాతవార్త):**



మండల పరిధిలోని అయ్యవారిగూడెం సహకార సంఘ సభ్యురాలైన రాజులదేవరపాడు గ్రామానికి చెందిన నల్లగంగుల నాగేంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. నాగేంద్రమ్మకు ఈ సొసైటీలో సభ్యత్వం ఉండటంతో ప్రభుత్వం మంజూరైన రూ.50వేల ఇన్సూరెన్స్ డబ్బులను ఆమె కొడుకు వెంకటరత్నంకు డీసీసీబీ బ్యాంకులో గురువారం సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు, మేనేజర్ మగినం వీరభద్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మీ, భానుప్రియా, సూపర్‌వైజర్ మహేష్, సీఈవో మోహన్‌రావు, సొసైటీ సిబ్బంది మురళీ, రమణారెడ్డి పాల్గొన్నారు.

## డెంగ్యూపై అవగాహన ర్యాలీ

**ఎర్రుపాలెం, మే 16, (ప్రభాతవార్త):**



జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని గురువారం బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శశిపూర్ణ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధికి నివారణ ఒక్కటే మార్గమని, డెంగ్యూ వ్యాధి ఏడీస్ ఈజిప్ట్ అనే దోమ కుట్టడం వల్ల వస్తుందన్నారు. ఈ వ్యాధి తీవ్ర తలనొప్పి, జ్వరం, శరీరంపై దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు ఉంటాయని ఈవ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టూ ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో కాంతమ్మ, హెచ్ఈవో సదాశివరావు, సూపర్‌వైజర్ జె.వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు శాయిరెడ్డి, అశోక్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లికి ఘనంగా సువర్ణ పుష్పార్చన



**పాల్వంచ రూరల్, మే 16 - (ప్రభాతవార్త):** మండలంలోని కేశవాపురం - జగన్నాథపురం గ్రామంలో వెలిసిన శ్రీశ్రీశ్రీ కనకదుర్గ దేవస్థానం పెద్దమ్మతల్లి ఆలయంలో ఈవో సుదర్శన్ ఆదేశాల మేరకు అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా సువర్ణ పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి హారతి, మంత్రపుష్పం, నివేదన తదితర ప్రత్యేక పూజలు అర్చకులచే నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శాస్త్రీయ ఆలోచన విధానమే మానవ అభివృద్ధికి దోహదం



**పాల్వంచ అర్బన్, మే 16 - (ప్రభాతవార్త):** శాస్త్రీయ ఆలోచన విధానమే మానవ అభివృద్ధికి దోహదపడతాయని మూఢనమ్మకాల నిర్మూలన సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు బైరి నరేష్ అన్నారు. పాల్వంచ పట్టణంలోని కొమరం భీమ్ హాల్‌లో జరిగిన బహుజన ఐక్య వేదిక సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో రోజురోజుకు మూఢనమ్మకాలు పెంచి పోషిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రజలు శాస్త్రీయ బద్ధంగా ఆలోచించకుండా ఎవరు ఏది చెప్పే అది గుడ్డిగా నమ్మి నిత్యం మోసపోతున్నారని అన్నారు. ప్రతీ చిన్న విషయానికి మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవడం లేదా, అనవసరమైన వాటిని ఆలోచించి దాడులు, హత్యలు చేయడం జరుగుతోందని, వీటి నుంచి ప్రజలు బయటికి రావాలని, అందరూ అవగాహనర కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బరిగడ దేవదానం, నబీ సాహెబ్, క్రాంతి, మంజూర్, రషీద్, చిటికెన ముసలయ్య, నిమ్మల రాంబాబు, పూజెం రమేష్‌లు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు పాటించండి



**మధిరరూరల్, మే 16, (ప్రభాతవార్త):** మండల పరిధిలోని దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలం సీజన్‌లో డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యరక్షణ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం గ్రామంలో కరపత్రాలను పంచుతూ ర్యాలీ చేశారు.

## సూర్యనారాయణ దంపతులకు నివాళులర్పించిన మల్లు నందిని

**మధిరరూరల్, మే 16, (ప్రభాతవార్త):** బోనకల్ మండలం ముష్టికుంట్లలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కొత్తూరు సూర్యనారాయణ, రుక్మిణి కుటుంబాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని గురువారం పరామర్శించారు. సూర్యనారాయణ, రుక్మిణి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి, సంతాపం తెలిపారు.




**పాల్వంచ, ములకలపల్లి, లక్ష్మీదేవిపల్లి, చంద్రుగొండ**

## షిరిడీ సాయిబాబా భజనమందిరంలో వార్షికమహోత్సవ పూజలు



**పాల్వంచ, మే 16 - (ప్రభాతవార్త):** అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న అని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాత పాల్వంచ సాయినగర్‌లోని శ్రీ షిరిడీ సాయిబాబా భజన మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగి 10 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఘనంగా 11వ వార్షిక మహోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారులు చిలుకూరి దినకర శాస్త్రీ, లక్ష్మీ నారాయణల ఆధ్వర్యంలో పలు అభిషేకాలతో పాటు అన్నాభిషేకం లాంటి పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో కొత్వాల సతీమణి విమలాదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 700 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్వాల శ్రీనివాసరావు, విమలారాణి, ఆలయ ధర్మకర్త ముత్యాల కోటేశ్వరరావు, ముదిగొండ శ్రీనివాసరావు, జనార్ధన్‌రెడ్డి, లోగాని వెంకట సత్యనారాయణ, మహేందర్, చావా వెంకటేశ్వరరావు, గూడపాటి నాగేశ్వరరావు, వజ్జల రాము, పెద్దింటి రాంబాబు, రమేష్, విజయ, జ్యోతికుమార్, సిరిపురపు మోహన్‌రావు, దారా చిరంజీవి, శాంతివర్దన్, రఘు, అమృతవల్లి ఉష, హేమ, పుష్ప, వీర రాఘవమ్మ, సామ్రాజ్యం, కృష్ణవేణి, పద్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం



**పాల్వంచ, మే 16 - (ప్రభాతవార్త):** కిన్నెరసానిలోని క్రీడా పాఠశాలలో గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సమ్మర్ కోచింగ్ క్యాంపును ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ ప్రారంభించారు. గురువారం నాడు కిన్నెరసాని లోని క్రీడా పాఠశాలలో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగే సమ్మర్ క్రీడా



శిక్షణా శిబిరాలను డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి మణెమ్మతో కలిసి ఆర్పరీ క్రీడలో సమ్మర్ క్యాంపును ప్రారంభిం చారు. వివిధ క్రీడాంశాలలో 60 మంది బాలురు, 60 మంది బాలికలు సమ్మర్ కోచింగ్ క్యాంపులో పాల్గొనే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదగాలని, విద్యార్థులను ఆయన ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ క్రీడల అధికారి బొల్లి గోపాలరావు, కొమరం వెంకటనారాయణ, ఏఎస్‌వో క్యాంపు ఇంచార్జి, ఏఎస్‌వోఎస్ నాగేశ్వరరావు, క్రీడా పాఠశాలల హెచ్ఎంలు చందు, క్రీడా శిక్షకులు పద్దం రాంబాబు, గొంది మారప్ప, నాగరాజు, ప్రసాద్, వెంకటేశ్వర్లు, సున్నం రామారావు, వాసు, రవి, బాబురావు, దివ్య, బాపనమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## సాగు పద్ధతులపై అవగాహనతోనే అధిక దిగుబడులు: ఏవో బాలాజి



కొణిజర్ల, మే16,(ప్రభాతవార్త):
వ్యవసాయ సాగు పద్ధతులపై కనీస అవగాహనతోనే మంచి దిగుబడులు సాధించవచ్చని స్థానిక కొణిజర్ల మండల వ్యవసాయ అధికారి డి.బాలాజి అన్నారు. మండల పరిధిలోని మేకాలకుంట గ్రామంలో పలు రైతుల పొలాల్లో దుక్కులు దున్నుతున్న సందర్భంగా గురువారం రైతులతో కలిసి పరిశీలించి తగు సూచనలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే వర్షాకాల పంటలకు రైతులకు ఎండాకాలం చెదురు ముదురు వర్షాలు పడుతున్నందున వ్యవసాయ భూములను ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రైతులు వేసవి దుక్కులు తప్పకుండా



చేసుకోవాలని, దీనివలన చాలా ఉపయోగాలు ఉన్నాయని, పంట పూర్తయిన తర్వాత మిగిలిన పంట అవశేషాలను కాల్చకుండా వేసవి దుక్కులు చేసుకోవడం వలన పంట అవశేషాలు మట్టి క్రిందపడి కుళ్లిపోతుంది. తద్వారా ఆర్గానిక్ కార్బన్ శాతం పెరగడమే కాకుండా వేసవి దుక్కులు చేసేటప్పుడు పంటలో ఉన్నా చీడపీడల లార్వాలు భూమిపై పొరల్లోనే ఉంటాయి. పొలం దున్నినప్పుడు అవి అన్నీ పైకి వస్తాయి. అప్పుడు వాటిని పలురకాల పక్షులు, వేరుకొని తింటాయి. దీనివలన వచ్చే వానాకాలం పంటకు చీడపీడల బెడద తగ్గుతుందని పొలం దున్నేటప్పుడు తూర్పు పడమట కాకుండా ఉత్తర దక్షణ వాలులో దున్నాలని, దీనివలన అప్పుడు అప్పుడు పడ్డ వర్షాలకు భూమిలో నీరు నిల్వ ఉంటుంది. ఎక్కువ రోజులు తేమ ఉంటుంది. వర్షాలు తక్కువ పడినప్పుడు బెట్ట పరిస్థితిలోను తట్టుకుంటుంది. పంట అవశేషాలు కూడా కలయ దున్నడం వలన భూమిలో హ్యూమస్ పెరిగి, భూమి గుల్ల బారుతుంది. నత్రజని శాతం పెరుగుతుంది. భూమి మెత్తగా ఉండటం వలన దానిలో విత్తనాలు వేసినప్పుడు మొలక శాతం ఎక్కువ ఉంటుంది. పెట్టుబడి తగ్గుతుంది. అధిక దిగుబడి పెరుగుతుంది. తక్కువ వర్షం వచ్చినా భూమి గుల్ల బారి ఉండడం ద్వారా ఎక్కువ రోజులు తేమ నిల్వ ఉంచుతుందని, ఇట్టి సూచనలను రైతు సోదరులు పాటించి తప్పకుండా వేసవి తుక్కులు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కొణిజర్ల మండల వ్యవసాయ అధికారి బాలాజి, ఏఈవో అఫ్రీన్, రైతులు ఉన్నారు.

## విద్యుత్ షాక్‌కు గురై మహిళ మృతి

దుమ్ముగూడెం, (ప్రభాతవార్త) :
దుమ్ముగూడెం మండల పరిధిలోని లచ్చిగూడెం గ్రామానికి చెందిన కట్టం వెంకటమ్మ(50) అనే మహిళ గురువారం సాయంత్రం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. మృతురాలు వెంకటమ్మ ఇంటి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు మేకలను తోలుటకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైంది. దీంతో స్థానికులు ఆమెను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

## తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేయాలి

దుమ్ముగూడెం, (ప్రభాతవార్త) :
వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ డివిజన్ సేవాదళ్ అధ్యక్షులు పీలక వెంకటరమణ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాం నాయక్ అత్యధిక మెజార్టీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ శ్రేణులు కృషి చేసినట్లే వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా తీన్మార్ మల్లన్న గెలుపుకోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు

దుమ్ముగూడెం, (ప్రభాతవార్త) :
దుమ్ముగూడెం గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ దత్తా శేష గిరి సాయిబాబా మందిరంలో బాబా వారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు బాబా వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వీ.టీ.వీ.రమణరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న ను గెలిపించండి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్



కారేపల్లి, మే 16,, ప్రభాతవార్త :
ఈ నెల 27వ తేదీన జరగబోయే ఖమ్మం వరంగల్ నల్గొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తలారి చంద్ర ప్రకాష్ జిల్లా కాంగ్రెస్ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు సురేందర్ మనియారు కోరారు. కారేపల్లి మండల కేంద్రంలో గురువారం వారు మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న అంటే ప్రశ్నించే గొంతుక అని, నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తి అని అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలను అరాచకాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచి నిజమైన జర్నలిస్టుగా ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీ గెలుపులో భాగమైన వ్యక్తి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నకు ఎమ్మెల్సీ ఓటర్లు మద్దతు ఇస్తూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో ఓడిపోయిన తీన్మార్ మల్లన్నను ఆ ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో ఓడిపోయిన తీన్మార్ మల్లన్నను ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా తీన్మార్ మల్లన్నకు అవకాశం ఇస్తే ఆయా సమస్యలు తీరుతాయని అన్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నేతలు



కారేపల్లి, మే 16, ప్రభాతవార్త :
సింగరేణి మండలం సూర్య తండ గ్రామానికి చెందినసూర్య తండ భానోత్ మంగీలాల్ కమారుడు నూతన వధూవరులు కిరణ్ సుమిత్ర వివాహానికి యూత్ కాంగ్రెస్ నేతలు హాజరై ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు చందవత్ వినోద్ కుమార్ ఆంగోత్ రవి ఠాగూర్ జరుపల ప్రసాద్ అజ్మీరా విజయ్ ధారావత్ అశోక్ భానోత్ కళ్యాణ్ బాదావత్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బీజేపీకి 12 సీట్లు వస్తాయి

నల్గొండ అర్బన్ ప్రభాతవార్త:
కేసీఆర్‌పై ఉన్న వ్యతిరేకతతో గత్యంతరం లేక కాంగ్రెస్‌కు ప్రజలు ఓటేసి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించారని బిజెపినాయకుడు ఈటల రాజేందర్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేతల అవినీతి అక్రమాలకు అడ్డులేదని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని తీవ్రంగా వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ని ఓడగొట్టడానికి కాంగ్రెస్‌కు ఓటువేస్తే కాలిపోయిన మోటర్లు, ఎండిపోయిన పంట పొలాలు కాలువలు దర్శనమిస్తున్నాయని విమర్శించారు. ప్రజలకు మెరుగైన పాలన అందించే శక్తి బీజేపికి మాత్రమే ఉందని స్పష్టం చేశారు. దేశ ప్రజలకు నాయకత్వం వహించే సత్తా బీజేపికి మాత్రమే ఉందన్నారు. దేశంలో ఎక్కడకు వెళ్లినా మోదీ కావాలని అంటు న్నారని పేర్కొన్నారు. నల్గొండ -ఖమ్మం- కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. . కాంగ్రెస్ పార్టీ అమలుకు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. విద్యార్థి దశ నుంచే సమస్యలపై పోరాడిన వ్యక్తి ప్రేమేందర్‌రెడ్డి అని 40 ఏండ్లుగా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా పార్టీని అంటిపెట్టుకొని ఉన్నారని వ్యాఖ్యానించారు. ప్రేమేంద ర్‌రెడ్డికి ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందని చెప్పారు. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రులందరూ మొదటి ప్రాధాన్య త ఓటును వేసి ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని 34 నియోజకవర్గాల్లో ఇంచార్జిలను నియమించి పట్టభద్రులకు దగ్గరవుతామని వివరించారు. ప్రశ్నించే గొంతుక లేకుంటే అధికారపక్షానిదే ఏకపక్షమవుతుందని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, నల్గొండ, ఖమ్మం, వరంగల్ బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, శానంపూడి సైదిరెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్, శ్రీదేవి రెడ్డి, పిల్లి రామరాజు యాదవ్, సాంబయ్య, మునికుమార్ పాల్గొన్నారు.




## కారేపల్లి, వైరా, కొణిజర్ల, ఏన్కూరు

## రమేష్ కుటుంబానికి ఎన్నారైల పరామర్శ



కారేపల్లి, మే 16, ప్రభాతవార్త :
సింగరేణి మండలం సీనియర్ టిడిపి నాయకులు కంచి రమేష్ కుటుంబానికి అండగా ఉంటామని సింగరేణి మండల పరిధిలోని కమలాపురం గ్రామానికి చెందిన ఎన్నారై చౌదరీస్ సతీస్, సంపత్, విజయ్, ఉదయ్ లు పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కంచి రమేష్ కుటుంబాన్ని గురువారం ఎన్నారైలు, కమలాపురం గ్రామస్తులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంచి రమేష్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని, చిన్నారుల భవిష్యత్తుకు తమ వంతుగా సహాయపడతామన్నారు. కంచి రమేష్ కుమారులు కంచి గురుసాయి దుర్గ వరప్రసాద్, కంచి తరుణ్ లను పరామర్శించి, రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దూదిపాళ్ళ భాస్కరరావు, పోలూరి రామారావు, వేములూరి కోటాచారి, గంగరబోయిన యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## రమేష్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుల నివాళి



కారేపల్లి, మే 16,, ప్రభాతవార్త :
టిడిపి వీరాభిమాని, సీనియర్ నాయకులు కంచి రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మండల కేంద్రంలోని వైఎస్ఎన్ గార్డెన్స్ లో గురువారం జరిగిన దశదినకర్మలో పాల్గొని కాంగ్రెస్ నాయకులు రమేష్ చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ నాయకులు సర్పంచ్ శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్ మేదరి వీర ప్రతాప్ టోనీ మాజీ సర్పంచ్ కురసం సత్యనారాయణ, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కడియాల సుధాకర్, పి ఎస్ ఆర్ యూత్ నాయకులు ముత్యాల సురేష్, చాగంటి వెంకటేశ్వర్లు (చిన్నా), గమిడి నరసింహారావు, బానోత్ హతిరాం బి ఆర్ ఎస్ నాయకుడు అడపా పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంగా మారిన విద్యుత్ స్తంభం

దుమ్ముగూడెం, (ప్రభాతవార్త) :
మండల పరిధిలోని కాటాయగూడెం గ్రామంలో విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదంగా మారిందని ముందస్తు చర్యగా ఒరిగిన కరెంటు స్తంభం స్థానంలో మరొక కరెంట్ పోల్‌ను నిర్మించాలని స్థానికులు విద్యుత్ శాఖ అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల సంభవించిన గాలి దుమారానికి విద్యుత్ స్తంభం ఒరిగి ఇంటిపై పడే ప్రమాదం ఉందని, ఎటువవంటి ప్రాణ నష్టం జరగకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.




## పదవతరగతి టాపర్లకు ఘనసన్మానం

అశ్వాపురం,మే16,ప్రభాతవార్త.



ఎస్ఎస్సి మరియు సిబిఎస్ఇ ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన పదిమంది విద్యార్థులను లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సిబిఎస్ఇలో అత్యధిక మార్కులు సాధించిన ఎం జశ్వితమాలతి చరణ్ మరియు ఎస్ఎస్సిలో అత్యధిక గ్రేడ్ సాధించిన ఎం గణేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు చార్టర్ ప్రెసిడెంట్ పిల్లారిశెట్టి హరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని, విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులకు లయన్స్ క్లబ్ సహకారం ఎల్లవేళలా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎన్ సత్యప్రకాష్ లయన్స్ క్లబ్ మణుగూరు జోనల్ ప్రెసిడెంట్ తారాప్రసాద్ లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ గాజుల పూర్ణచంద్రరావు సెక్రటరీ మీరాహుస్సేన్ ట్రెజరర్ అడబాల నాగేశ్వరరావు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

అశ్వాపురం,మే16,ప్రభాతవార్త.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య పిలుపునిచ్చారు. గురువారం మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనపై రాజీలేని పోరాటంచేసి ప్రశ్నించే గొంతుగా, పేదల కష్టాన్ని తన కష్టంగా భావించే నల్గొండ వరంగల్ ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై వుందన్నారు. ఈ సమావేశంలో బట్టీలగుంపు మాజీ సర్పంచ్ బట్టా సత్యనారాయణ పార్టీ సీనియర్ నాయకులు ఓరుగంటి రమేష్‌బాబు వెంగళ సోమిరెడ్డి మాదిగ హక్కుల రాష్ట్ర యువసేన అధ్యక్షుడు గొల్లపల్లి నరేష్‌కుమార్ యూత్ కాంగ్రెస్ నాయకులు కోలా శశికాంత్ పర్శిక ఆదినారాయణ శెట్టిపల్లి రాజశేఖర్ జిమ్మ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ జ్వరాలపై అవగాహన

మణుగూరు, ప్రభాతవార్త, మే 16 :



మణుగూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డెంగ్యూ జ్వరాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మణుగూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శివకుమార్ డెంగ్యూ జ్వరాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిశాంత్‌రావు, ఏఎంవో జి.వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఎస్‌యూవో లింగ్యానాయక్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**-సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంతోటి నాగేశ్వరరావు**

మణుగూరు, ప్రభాతవార్త, మే 16 :



సింగరేణి సంస్థలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆంతోటి నాగేశ్వరరావు అన్నారు. ఆయన గురువారం మణుగూరు ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్‌ను కలిసి ఏరియా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఉద్యోగుల ఏరియాలో పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ఛేంజ్‌ఆఫ్ క్వార్టర్స్ ఇతర సమస్యలు పరిష్కరించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పి.అంకుష్, జె.మల్లేష్, ఎస్ కుమారస్వామి, కె.కృష్ణ, నాగరాజు, ప్రమోద్, అశోక్, శ్రీనివాస్, సారథిబాబు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## డెంగీ నివారణకు కదులుదాం

**డాక్టర్ మధు అవగాహన ర్యాలీ**

కరకగూడెం,ప్రభాతవార్త:



కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం కరకగూడెం వైద్యాధికారి డా,కారం మధు ఆద్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవం. డెంగీ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డా,మధు మాట్లాడుతూ..డెంగీతో ఎంతో మంది మంచాన పడుతున్నారు. మరికొంత మంది భయంతో చనిపోతున్నారు సమాజ భాగస్యామ్యంతో డెంగీ వ్యాదిని నివారించ వచ్చని వ్యాదిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. డెంగీని నివారిద్దాం అనే నినాదంతో ప్రతి ఒక్కరు ముందుకురావాలన్నారు. డెంగీ రాకుండా, దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరు దోమ తెరలు వాడాలని సూచించారు. రానున్న వర్షా కాలంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డేగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యసిబ్బంది ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## పాయిల్ తోట దగ్ధం

**ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వినతి**

పినపాక, మే 16, ప్రభాతవార్త



మండల పరిధిలోని జానంపేట గ్రామంలో పలువురి రైతులకు చెందిన పామాయిల్ తోట ప్రమాదవశాత్తు దగ్ధం అయిన ఘటన గురువారం జరిగింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్ తోటలను పెంచేందుకు రైతులు సబ్సిడీతో ప్రోత్సహించగా స్థానిక రైతులు పెద్దమొత్తంలో పామాయిల్ సాగు చేస్తున్నారు. ఈక్రమంలో పామాయిల్ తోటకు అనుకుని ఉన్న పొలంలో ప్రమాదవశాత్తు వరిగడ్డికి మంటలు చెలరేగాయి. దీంతో పాటు గాలి రావడంతో ఐదున్నర ఎకరాల్లో పామాయిల్ తోట కూడా కాలిపోయింది. చెట్లకు నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన డ్రిప్ పైప్‌లైన్ కూడా మంటల్లో కాలిపోయింది. తోట నష్టపోయిన రైతుల వివరాలు.. గాండ్ల ఆశోక్ ఎకరం 50 సెంట్లు, చిత్తలూరి సత్యం రెండు ఎకరాల 50 సెంట్లు, గాండ్ల విజయ్ ఎకరం 50 సెంట్లు ఉంది. ప్రభుత్వం స్పందించి ఆర్థికంగా నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## రైతులకు వెంటనే రూ.500 బోనస్ అందజేయాలి

**-మణుగూరు తహసీల్దార్‌కు బీఆర్ఎస్ నాయకులు వినతి**

మణుగూరు, ప్రభాతవార్త, మే 16 :



రైతులు పండించిన పంటకు కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ హామీలో భాగంగా రూ.500 బోనస్ అందజేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు గురువారం మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు మాట్లాడుతూ రైతులకు ఎలక్షన్ హామీలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌తో టీబీజీకేఎస్‌కు సంబంధం లేదని ప్రకటించే నైతికత పుట్టు మధుకు లేదు

**-మణుగూరు ఏరియాలో పుట్ట మధు వ్యాఖ్యలను ఖండించి టీబీజీకేఎస్ నాయకులు**

మణుగూరు, ప్రభాతవార్త, మే 16 :



సింగరేణి వ్యాప్తంగా ఆరు జిల్లాలు 11 డివిజన్‌లలో విస్తరించి ఉన్న టీబీజీకేఎస్ యూనియన్ నూతన నాయకత్వంపైన బీఆర్ఎస్ పార్టీ మంథిని ఇంచార్జి పుట్ట మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ ఇంచార్జి నాగెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన గురువారం స్థానిక టీబీజీకేఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నూతన రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణల సారథ్యంలో టీబీజీకేఎస్ యూనియన్ కొత్త ఒరవడిని సృష్టించనున్నదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీతో టీబీజీకేఎస్ యూనియన్‌కు సంబంధంలేదని ప్రకటించే అధికారం, నైతికత బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పుట్ట మధుకు లేదన్నారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు ఇజ్రాయిల్, కొత్తగట్టు రామాచారి, బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

## నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

మణుగూరు, ప్రభాతవార్త, మే 16 :

నేడు మణుగూరు హనుమాన్ ఫంక్షన్ హాల్ నందు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల పినపాక నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్గొండ, వరంగల్, ఖమ్మం బీఆర్ఎస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ గ్రాడ్యుయేషన్ ఓటర్స్ అధిక సంఖ్యలో హాజరుకావాలని అన్నారు. పినపాక నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, యువజన నాయకులు, మహిళలు, అనుబంధ సంఘాల నాయకులు సమన్వయం చేసి విజయవంతం చేయాలని కోరారు.

## విద్యార్థులకు అభినందనలు

మణుగూరు, ప్రభాతవార్త, మే 16 :

మణుగూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం టెన్త్, ఇంటర్ సీబీఎస్ఈ పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం 100 మందికి భోజనాలు ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు గాజుల పూర్ణచందర్‌రావు తెలిపారు. చార్టర్ ప్రసిడెంట్ పిల్లారిశెట్టి హరిబాబు, అప్‌కమ్మింగ్ ప్రసిడెంట్ సత్యప్రకాష్, మీరా హుస్సేన్, నాగేశ్వరరావు, తారా ప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.